విలీనానికి సాంకేతిక సమస్యలు

- 'ఉక్కు' ఉద్యోగులను తొలగించక తప్పదు
- నిధులు వెచ్చించే స్థితిలో కేంద్రం లేదు
- కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ 2

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 59 | విజయవాడ, ఆదివారం 29 సెప్టెంబర్ 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 29 September 2024 | Rs



రెండోరోజూ వర్షార్పణం

- ఒక్క బంతి పడకుండానే నిలిచిన ఆట
- బంగ్లాదేశ్ 107/3

5



విద్యార్థికి బంగారు పతకం అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము. పక్కన తెలంగాణ గవర్నర్, సిఎం, తదితరులు

పేదలకు న్యాయం ఎక్కడ?

నల్సార్ 21వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముర్ము

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధనవంతులతో పోలిస్తే పేదలు న్యాయం పొందలేకపోతున్నారని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన 21వ వార్షిక స్నాతకోత్సవానికి రాష్ట్రపతి హాజరయ్యారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ లా యూనివర్సిటీ ఛాన్సలర్ జస్టిస్ అలోక్ ఆరాధే అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సవంతో రాష్ట్రపతి మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో చట్టాల రూపకల్పనలో నల్సార్ కృషిని ప్రశంసించారు. దేశ రాజ్యాంగ విలువల్లో కీలకమైన సామాజిక న్యాయం అనే భావనను లోతుగా అర్థం చేసుకోవాలని పట్టభద్రులకు సూచించారు. నిజాయితీ, ధైర్యం విలువలకు కట్టుబడి సామాజిక మార్పులకు సారథులుగా నూతనంగా న్యాయ పట్టాలు పొందుతున్న వారు ఉండాలన్నారు. బెయిళ్ళు రాకుండా పెద్ద సంఖ్యలో జైళ్లలో ఉంటున్న పేదల గురించి ఆమె ప్రస్తావించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ నిజాయితీగా పనిచేశారని, దానిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని, పేదలకు న్యాయం దక్కేందుకు కృషి చేయాలని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతోందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించుకోవాలని సూచించారు. నిబద్ధత, పారదర్శకంగా పనిచేస్తే ఏ రంగంలోనైనా ఎంతో ఎత్తుకు ఎదగవచ్చన్నారు. ప్రధానంగా నల్సార్ జంతు సంరక్షణ చట్టాల గురించి చేస్తున్న కృషిని ప్రస్తావించారు.. అనేక పరిమితులు ఉన్నప్పటికీ ఆడపిల్లలు తమ ఉన్నత ప్రదర్శనతో వారి తల్లిదండ్రులు గర్వపడేలా చేస్తున్నారని చెప్పారు. నల్సార్ విశ్వవిద్యాలయం మహిళా న్యాయవాదులు, న్యాయ విద్యార్థులతో కూడిన దేశవ్యాప్త నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలని సూచించారు. మహిళలపై అఘాయిత్యాలను అరికట్టడానికి ఈ నెట్‌వర్క్ ఎంతో పని చేయగలదన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ ఛాన్సలర్ ప్రొ.కృష్ణదేవరావు మాట్లాడుతూ.. వికలాంగుల హక్కుల చట్టాలు, బాలల హక్కులు, ఖైదీల హక్కులు, సంస్కరణల రంగాల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో నల్సార్ సాధించిన విజయాలను వివరించారు. అంతర్విభాగ అధ్యయనాలు చేయడం ఆధునిక విద్యారంగంలో చాలా ప్రధానమని, నల్సార్ బోధనా, అభ్యసన పరిశోధన కార్యక్రమాన్ని విస్తరించడానికి, అలాగే యూనివర్సిటీ విద్యా విభాగాలను వైవిధ్యపరచడానికి ఉదారంగా సహాయం అందించాలని అభ్యర్థించారు. పట్ట భద్రులైన విద్యార్థులకు నల్సార్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ జస్టిస్ అలోక్ ఆరాధే, గౌరవ అతిథి, జస్టిస్ పిఎస్. నరసింహ పతకాలు అందజేశారు. మొత్తం 582 డిగ్రీలను ప్రదానం చేశారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సిట్' దర్యాప్తు ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుమల శ్రీవారి లడ్డూ వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) శనివారం దర్యాప్తు ప్రారంభించింది. తిరుమలకు ఎఆర్ డెయిరీ మిల్క్ ఫుడ్స్ సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగిందంటూ తిరుపతి ఈస్టు పోలీస్ స్టేషన్లో టిటిడి మార్కెటింగ్ జిఎం మురళీకృష్ణ ఇటీవల ఇచ్చిన ఫిర్యాదు కాపీని సిట్ బృందం తీసుకుంది. ఈ ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ఆధారంగా మార్కెటింగ్ విభాగం రికార్డులను ఈ బృందం పరిశీలించనుంది. సిట్ సభ్యులు మూడు బృందాలుగా ఏర్పడి.. ఒక బృందం తిరుమలలోనూ, మరో బృందం తిరుపతిలోనూ, ఇంకో బృందం చెన్నయ్‌లోనూ దర్యాప్తు చేయనుంది. టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరితో అదివారం సమావేశం కానున్నట్లు సమాచారం. తమిళనాడులోని దిండిగల్‌లో ఉన్న ఎఆర్ డెయిరీ మిల్క్ ఫుడ్స్ సంస్థ నుంచి నెయ్యి అందిందని ఫిర్యాదులో ఉన్నందున చెన్నయ్‌కు ఒక బృందం వెళ్లనుంది. తిరుమల లడ్డూ పోటులోనూ విచారణ జరపనుంది. గత ఐదేళ్లలో వైసిపి హయాంలో జరిగిన నెయ్యి కొనుగోళ్ల రికార్డులను పరిశీలించనుంది. ఏ ప్రభుత్వ హయాంలో ఎన్ని ట్యాంకర్ల నెయ్యి సరఫరా అయ్యింది, ఎంత నాణ్యత ఉంది, ఎన్ని ట్యాంకర్లను ఏయే కారణాలతో తిప్పి పంపారు తదితర అంశాలపై విచారించనుంది. మైసూర్ ల్యాబ్ ఇచ్చిన నెయ్యి నాణ్యత రిపోర్టును పరిశీలించనుంది. ఈ బృందానికి సారథ్యం వహిస్తోన్న సిట్ చీఫ్, గుంటూరు రేంజి ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠిని మీడియా ప్రతినిధులు కలవగా, దర్యాప్తు పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ఈ బృందంలో విశాఖ రేంజి ఐజి గోపినాథ్‌జెట్టి (టిటిడి మాజీ విజిలెన్స్ అధికారి), కడప ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు, తిరుపతి అదనపు ఎస్‌పి వెంకట్రావు, డిఎస్‌పిలు జి.సీతారామారావు, శివనారాయణస్వామి ఉన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు తిరుపతి వచ్చిన సిట్ బృందం తొలుత తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. అనంతరం టిటిడి ఇఒ శ్యామలరావును కలిసింది.



ఢిల్లీలోని తాల్కటోర ఇండోర్ స్టేడియంలో జరిగిన ఏచూరి సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న రాహుల్ గాంధీ చిత్రంలో ప్రకాశ్ కరత్, కనిమొళి

ఇండియా ఫోరం రూపశిల్పి

ఏచూరికి జాతీయ నేతల ఘననివాళి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కమ్యూనిస్టు యోధుడు, పరోపకారి, అందరూ ఆమోదించిన నేత సీతారాం ఏచూరికి పలువురు జాతీయ నాయకులు శనివారం ఘనంగా నివాళు లర్పించారు. ఢిల్లీలోని తాల్కటోర ఇండోర్ స్టేడియంలో సిపిఎం కేంద్ర కమిటీ ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో పాల్గొన్న వీరు దేశంలో ప్రగతిశీల, ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల ఐక్యతకు సీతారాం ఏచూరి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. జనం పెద్దయెత్తున హాజరైన ఈ సభలో వివిధ పార్టీల నేతలు మాట్లాడుతూ దేశాన్ని కబళించేందుకు యత్నిస్తున్న మతతత్వ శక్తులకు గట్టి ఎదురుదెబ్బ తగలడానికి కారణమైన ఇండియా బ్లాక్ రూపశిల్పి ఏచూరి అని కొనియాడారు. సంక్షోభ సమయాల్లో సీతారాం ఏచూరి తమకు మనోధైర్యాన్నిచ్చిన తీరును వారు గుర్తు చేసుకున్నారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ సీతారాం ఏచూరి సంతాప తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. మార్క్సిజం పట్ల ఆయనకున్న నిబద్ధతను, విద్యార్థి దశ నుండి దేశంలో వామపక్ష ఉద్యమానికి బహుముఖంగా చేసిన సేవలను ఆమె గుర్తు చేసుకున్నారు. దేశం కీలకమైన మలుపులో ఉన్న ఈ సమయంలో సీతారాం లేకపోవడం చాలా పెద్ద లోటు అన్నారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, డి.రాజా (సిపిఐ), ఫరూక్ అబ్దుల్లా (ఎన్‌సి), కనిమొళి (డిఎంకె), మనోజ్ ఝూ (ఆర్‌జెడి), రాంగోపాల్ యాదవ్ (ఎస్‌పి), సుప్రియా సూలే (ఎన్‌సిపి), గోపాల్ రాయ్ (ఆప్), దీపాంకర్ భట్టాచార్య (సిపిఐఎంఎల్), మహువా మాఝీ (జెఎంఎం), మనోజ్ భట్టాచార్య (ఆర్‌ఎస్‌పి), జి దేవరాజన్ (ఫార్వర్డ్ బ్లాక్), ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్, సీనియర్ పాత్రికేయులు ఎన్ రామ్, సామాజిక వేత్త తీస్తా సెతల్వాద్ మాట్లాడారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్, బివి రాఘవులు, సూర్యకాంత్ మిశ్రా, సుభాషిణి అలీ, ఎమ్‌డి సలీం, ఎంఎ బేబి, తపన్ సేన్, జి.రామకృష్ణ, ఎ. విజయరాఘవన్, నిలోత్పల్ బసు, అశోక్ దావలే, రామచంద్రడోమ్, గోవిందన్ మాస్టర్, పశ్చిమ బెంగాల్ లెఫ్ట్‌ఫ్రంట్ చైర్మన్ బిమన్ బసు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఏచూరి జీవిత ప్రస్థానాన్ని కళ్లకు కట్టింది. చిన్ననాటి ఫొటోలు, స్కూల్, కాలేజీ, స్పోర్ట్స్, జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాల్లో, ఉద్యమాల్లో పాల్గొన్న ఫొటోలు ఆయన జీవిత గమనాన్ని మిగతా 5లో

'ఉక్కు' కార్మికుల జోలికొస్తే ఊరుకోం..

- కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని చూస్తే తీవ్ర పరిణామాలు
- స్టీల్‌ప్లాంట్‌లో పలుచోట్ల ఆందోళనలు



స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు, ఉక్కు కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి- ఉక్కునగరం, ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ కార్మికుల జోలికొస్తే సహించేది లేదని, ఎంతటి ఉద్యమాలకైనా సిద్ధంగా ఉన్నామని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. నాలుగు వేల మంది ఉక్కు కాంట్రాక్టు కార్మికులను తొలగించే క్రమంలో వారి గేట్ పాస్‌లను వెనక్కి తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం శుక్రవారం ఉత్తర్వులు ఇవ్వడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కు కార్మికులపై కేంద్రంలోని మోడీ సర్కారు, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అవలంబిస్తున్న తప్పుడు విధానాలను నిరసిస్తూ స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు, అడ్మిన్ బిల్డింగ్, బిసి గేట్ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో కార్మికులు, నాయకులు శనివారం ఆందోళనలకు దిగారు. వారినుద్దేశించి కార్మిక సంఘాల నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, మిగతా 2లో

1నుండి 3వ తేది వరకు దీక్షలు

- కార్మిక సంఘాల ఐక్య వేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం అక్టోబర్ 1,2,3 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున దీక్షలను నిర్వహించాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. శనివారం విజయవాడలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి ఓబులేసు, ఐఎఫ్‌టియు నాయకులు కె పొలారి, ఐఎఫ్‌టియు నాయకులు రామకృష్ణ, టిఎన్‌టియుసి నాయకులు రఘురామరాజు, టియుసిసి నాయకులు పివి సుందరరాజు, ఎఐసిసిటియు నాయకులు ఎం ఈశ్వర్, ఎఐఎఫ్‌టియు నాయకులు జె కిశోర్‌బాబు, ఐఎన్‌టియు నాయకులు పాల్గొని విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ పరిరక్షణకు ఉద్యమ కార్యచరణను ప్రకటించారు. అక్టోబర్ 1వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆద్వర్యంలో, అక్టోబర్2వ తేదీన గాంధీ జయంతి రోజున రాష్ట్రంలోని కార్మిక సంఘాల ఆద్వర్యంలో అక్టోబర్ 3న రైతు సంఘాలు, వ్యవసాయకార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రతి జిల్లా కేంద్రం, ముఖ్యపట్టణాలు, మండల కేంద్రాల్లో జరిగే ఈ మూడు రోజుల దీక్షలను జయప్రదం చేసేందుకు కార్మిక సంఘాలు కృషి చేయాలని వారు పేర్కొన్నారు. ఈ దీక్షలకు పెద్ద సంఖ్యలో కార్మికులు, రైతులు, వ్యవసాయకార్మికులు, విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఎపి జెఎసి సెక్రటరీ జనరల్‌గా కెఎస్ఎస్ ప్రసాద్

- 12వ పిఆర్‌సి కమిషనర్‌ను నియమించాలని డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిజెఎసి సెక్రటేరియట్ సెక్రటరీ జనరల్‌గా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కెఎస్-ఎస్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఎపి ఎన్జీవో కార్యాలయంలో జెఎసి చైర్మన్ కెవి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన జెఎసి కార్యవర్గ సమావేశంలో శనివారం ఈ ఎన్నిక జరిగింది. కో చైర్మన్లుగా ఎపిటిఎఫ్-1938 అధ్యక్షులు జి హృదయరాజు, ఎపిటిఎఫ్-257 అధ్యక్షురాలు సిహెచ్ మంజుల, ఆప్టా ప్రధాన కార్యదర్శి కె ప్రకాష్‌రావు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎపి అగ్రికల్చర్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు సాయికుమార్ ఎన్నికయ్యారు. 12వ పిఆర్‌సి నూతన కమిషనర్‌ను వెంటనే నియమించాలని, ఆ నివేదిక సమర్పించేలోపు 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించి అమలు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. పిఎఫ్, ఎపిజిఎల్ఐ రుణాల క్లెయిమ్‌లు, సరండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ మంజూరు చేయాలని, 11వ పిఆర్‌సి, డిఎ బకాయిలు చెల్లించాలని, సిపిఎస్ ఉద్యోగులకు 11నెలల మ్యాచింగ్ గ్రాంట్ జమచేయాలని, మిగతా 5లో

నిర్మలా సీతారామన్, జెపి నడ్డాలపై కర్ణాటకలో ఎఫ్ఐఆర్

- ఎన్నికల బాండ్ల కేసులో న్యాయస్థానం ఆదేశాలతో చర్యలు



బెంగళూరు : ఎన్నికల బాండ్లకు సంబంధించి అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా తదితరులపై కర్ణాటకలోని తిలక్‌నగర్ పోలీసులు శనివారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎన్నికల బాండ్ల పేరుతో పలువురు పారిశ్రామికవేత్తలను, ఇతర ప్రముఖులను నిర్మలా సీతారామన్, ఇతర బిజెపి పెద్దలు బెదిరించి ఆ పార్టీకి నిధులు వచ్చేలా చేశారంటూ... జనాధికార సంఘర్ష పరిషత్తుకు చెందిన ఆదర్శ్ ఆర్ అయ్యర్ ఈ ఏడాది మార్చి 30న తిలక్‌నగర్ పోలీసులను మొదట ఆశ్రయించారు. వారు స్పందించకపోవడంతో బెంగళూరు సౌత్ ఈస్ట్ డిసిపిని ఆశ్రయించారు. అయినా ఫలితం లేకపోవడంతో ఎంపిలు, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసుల కోసం ఏర్పాటు చేసిన కర్ణాటక ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆయన ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సంతోశ్ గజానన హెగ్డే నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను శుక్రవారం ఆదేశించారు. దీనిపై తదుపరి విచారణ అక్టోబరు 10న చేపట్టనున్నారు. ప్రత్యేక న్యాయ స్థానం ఆదేశాల మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), జెపి నడ్డాతో సహా బిజెపి కర్ణాటక అధ్యక్షుడు బివై విజయేంద్ర, సీనియర్ నాయకులు నలీన్ కుమార్ కటీల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎలక్టోరల్ బాండ్ల నెపంతో రూ.8 వేల కోట్లకుపైగా నిందితులు లబ్ధిపొందారని ఆదర్శ్ ఆరోపించారు. పలువురు కార్పొరేట్లు, ఆయా కంపెనీల సిఇఒలు, ఎమ్‌డిలు, టాప్ ఎగ్జిక్యూటివ్‌లపై దాడులు , ఆస్తుల స్వాధీనం, అరెస్టులకు ఇడిని నిర్మలా సీతారామన్ ఒక సాధనంగా వాడుకున్నారని ఫిర్యాదు దారుడు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దాడులకు భయపడి చాలామంది కార్పొరేట్లు కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేయాల్సి వచ్చిందని, వాటిని నడ్డా, కటీల్ విజయేంద్ర తదితరులు సొమ్ము చేసుకున్నారని పేర్కొన్నారు.



ఇజ్రాయిల్ దాడిలో ధ్వంసమైన హిజ్బుల్లా కార్యాలయం

హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా హత్య

- బీరుట్‌పై ఇజ్రాయిల్ పాశవిక దాడులు

బీరుట్ : ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు లెబనాన్ రాజధాని బీరుట్‌లోని రద్దీగా ఉండే ప్రాంతాలపై పెద్దయెత్తున దాడులు చేసి హిజ్బుల్లా చీఫ్ నస్రల్లాతో సహా పలువురిని హత్యచేసింది. భారీగా విధ్వంసం సృష్టించింది. వరుస పేలుళ్లు బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలను కదిలించేశాయి. ఎప్పుడూ జనంతో రద్దీగా ఉండే దహీయేహ్ ప్రాంతం దట్టమైన పొగలతో కమ్మేసింది. అలాగే తూర్పు లెబనాన్‌లోని బెకా ప్రాంతంలో హిజ్బుల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడుల్లో ఆ సంస్థ చీఫ్ సయ్యద్ హసన్ నస్రల్లాతో సహా పలువురు చనిపోయారు.



హిజ్బుల్లా ప్రధాన కార్యాలయంతో బాటు ఆ చుట్టు పక్కల పలు నివాస భవనాలు ఈ దాడుల్లో నేలమట్టమయ్యాయి. దాడి జరిగిన ప్రదేశంలో పెద్ద బిలం ఏర్పడింది. లెబనాన్ తాత్కాలిక ప్రధాని నజీబ్ మికాట్ మాట్లాడుతూ, ఇజ్రాయిల్ అనాగరిక దాడులతో కాల్పుల విరమణ యత్నాలకు నిలువునా తూట్లు పొడిచిందని విమర్శించారు. నస్రల్లా చనిపోయిన విషయాన్ని హిజ్బుల్లా మిగతా 5లో

సిఆర్‌డిఏ పరిధిలో సంప్రదింపుల కమిటీలు ఏవీ?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని నిర్మాణంలో భూములిచ్చిన రైతులతో ఏర్పాటు చేయాల్సిన సంప్రదింపుల (గ్రామస్థాయి, పూలింగు పథకంస్థాయి) కమిటీలను ఇప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. గ్రామస్థాయిలో వచ్చే సమస్యలు, రాజధాని స్థాయిలో వచ్చే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కమిటీలు వేయాలని సిఆర్‌డిఏ చట్టంలో పేర్కొన్నారు. అయితే, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న తొలి ఐదేళ్లలో ఈ కమిటీల జోలికి పోలేదు. దీంతో గ్రామస్థాయిలో సమస్యలను సిఆర్‌డిఏ కార్యాలయానికి వచ్చి చెప్పుకునేవారు. అయితే ప్రభుత్వాన్ని నమ్మి భూములిచ్చిన రైతులను మర్యాదగా చూడాలని, వారికి ఏమైనా సమస్యలు ఉంటే గ్రామస్థాయిలోనే ఒక నివేదిక తయారు చేసి రాజధాని వ్యాప్తంగా రైతులతో ఏర్పాటు చేసే ఒక కమిటీకి సమర్పించేలా జిఓ తీసుకొచ్చారు. 2015 ఏప్రిల్ 17వ తేదీన 240 నెంబరుతో ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేశారు. అప్పటి పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గిరిధర్ ఆర్మానే ఈ జిఓను విడుదల చేశారు. ల్యాండ్ పూలింగుకు రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చినందున పథకం అమల్లో అన్నిస్థాయిల్లోనూ వారి సలహాలు, సూచనలు అవసరమని జిఓలో పేర్కొన్నారు. పూలింగు స్కీము నిబంధనల్లోనూ ఈ విషయం ఉన్నందున వెంటనే గ్రామస్థాయిలో సంప్రదింపుల కమిటీ వేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. కమిటీలు వేసే సమయంలో సభ్యులు ఎవరుండాలనేది జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం తీసుకోవాలనీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2015లో జిఓ అయితే ఇచ్చారుగానీ 2019 వరకూ అంటే తొలి ఐదేళ్లలో కమిటీలు వేయలేదు. అనంతరం వైసిపి ప్రభుత్వం ఏర్పాటైంది. 2024లో మరలా టిడిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 100 రోజులు గడిచిపోయింది. ఇప్పటికీ గ్రామస్థాయి, రాజధాని స్థాయి కమిటీలు ఏర్పాటుపై అటు మంత్రిగానీ, ఇటు గుంటూరు జిల్లా అధికారులుగానీ స్పందించడం లేదు. రాజధాని పరిధిలో ఏర్పాటు చేసే కమిటీలకు చట్టపరమైన హక్కులూ కల్పించాలని అప్పట్లో నిర్ణయించారు. ఇటీవల రాజధాని పరిధిలో జరిగిన ఒకటీ రెండు అంశాల విషయంలో ఈ కమిటీల ఏర్పాటు వ్యవహారం చర్చనీయాంశం అయింది. ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రాగానే కొండవీటివాగును సరిచేయాలని రైతులు కమిషనర్‌కు సూచించారు. దీన్ని కమిషనర్ కాటంనేని భాస్కర్ పెడచెవిన పెట్టారు. కనీసం తిరుగు సమాధానం కూడా ఇవ్వలేదు. ఈలోపు భారీ వర్షాలు రావడంతో ముంపు వచ్చి చేరింది. వెంకటపాలెం పరిధిలో ఇప్పటికీ ముంపు నీరు నిలిచిపోయి ఉంది. గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై కూడా కమిషనర్ ఇదే వైఖరి అవలంభించారని సమాచారం. ముఖ్యంగా రైతులు ఏడాది కౌలు విషయంలో సిఆర్‌డిఏ నుండి ఇబ్బందులు పడ్డారు. ఒకే గ్రామంలో కొంతమంది రైతులకు డబ్బులు జమైనా మరికొంత మందికి జమకాలేదు. దీనిపై కమిషనర్‌కు చెప్పుకునేందుకు వెళ్లినా అందుబాటులో లేరని సమాచారం. దీనిపై రైతులు ఇటీవల మంత్రి నారాయణ దృష్టికి ఈ సమస్యలు తీసుకెళ్లారు. వెంటనే పరిష్కరించాలని మంత్రి కమిషనర్‌కు చెప్పినా ఆయన స్పందించలేదు. ఏడాది కౌలు డబ్బులు ఎందుకుపడలేదో సమాధానం చెప్పేవారు కరువయ్యారు. ఇదే అంశంపై మంత్రి కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రైతులు కూడా తాము భూములు ఇచ్చి అధికారుల చుట్టూ తిరగడం అక్కడకు వెళితే కమిషనర్ గంటల తరబడి కూర్చోబెట్టడం నామోషీగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చట్టపరంగా వాటిని ఏర్పాటు చేస్తే కమిటీల ఆధ్వర్యాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళతామని పరిష్కారానికి మార్గం సులువవుతుందని వారు అంటున్నారు. ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాల్సిఉంది.



బొజ్జా తారకం సతీమణి విజయ భారతి కన్నుమూత

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

పౌర హక్కుల నేత బొజ్జా తారకం సతీమణి, ప్రముఖ రచయిత్రి బి విజయభారతి (83) శనివారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. కొంతకాలంగా వయో భారంతో పలు అనారోగ్య సమస్యలతో ఆమె బాధపడుతున్నారు. కుంధన్‌బాగ్‌లోని తన కుమారుడు, ఐఎఎస్ అధికారి రాహుల్ బొజ్జా నివాసంలో తుది శ్వాస విడిచారు. విజయభారతికి ఒక అమ్మాయి కూడా ఉన్నారు. అభిమానుల సందర్శనార్థం మిగతా 2లో

జగన్ అబద్ధాలను అడ్డుకోండి

- పార్టీ నేతలతో టిడిపి అధినేత చంద్రబాబు
- గ్రీవెన్స్‌లో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలకు మనం నిజం చెప్పేలోపు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అబద్ధాలను ప్రచారం చేయాలని చూస్తున్నారని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అందుబాటులో ఉన్న పార్టీ నేతలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ జగన్ చెబుతున్న అబద్ధాలను అడ్డుకోవాలని, ప్రభుత్వం-పార్టీ సమన్వయంతో వ్యవహరించి వాటిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. వైసిపి వేగంగా వ్యాప్తి చేయాలనుకుంటున్న అసత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు చెప్పారు. కృష్ణా-గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పి అశోక్‌బాబులను ఆదేశించారు. అనంతపురం జిల్లాలో రథానికి నిప్పు పెట్టిన ఘటనపై పోలీస్‌ల తీరు సరిగా లేదని పార్టీ నేతలు చంద్రబాబు వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. విచారణ పూర్తికాకుండానే ఈ ఘటనలో రాజకీయ ప్రమేయం లేదనడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పోలీసులు ఇలాంటి ప్రకటనలు ఇవ్వకుండా చూడాలని కోరినట్లు సమాచారం. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయ స్వామి, పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు, ఫిర్యాదులు పరిష్కరిస్తాం

ప్రజల సమస్యలు, ఫిర్యాదులను పరిష్కరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్ర నలుమూలాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలను ఆయన స్వీకరించారు.

వైసిపి ప్రభుత్వం 300 యూనిట్ల విద్యుత్ వినియోగించాననే కారణంతో తన పింఛన్‌ను తొలగించిందని గుంటూరు పట్టణం గోరంట్లకు చెందిన తన్నీరు సామ్రాజ్యం అనే దివ్యాంగురాలు ఫిర్యాదు చేశారు. తిరిగి తన పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు. సిఎం సహాయనిధికి తుళ్లూరుకు చెందిన ఆలూరి వెంకటరావు, ఆలూరి ఆదినారాయణ రూ.50వేలు, ఎం శ్యామలరావు రూ.25వేలు, కె రాజేశ్వరి రూ.25వేలు, విజయనగరానికి చెందిన కె హారిక రూ.15వేలు చొప్పున విరాళం అందించారు.



గుర్రం జాషువాకు నివాళులర్పిస్తున్న సిఎం చంద్రబాబు

గుర్రం జాషువాకు నివాళి

గుర్రం జాషువా జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయనకు నివాళలర్పించారు. టిడిపి కార్యాలయంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళలర్పించారు.

తన జీవితంలో అడుగడుగునా కుల వివక్షను ఎదుర్కొంటూనే తెలుగు సాహితీలోకంలో ప్రజ్వరిల్లిన తేజోమూర్తి, దళితాభ్యుదయవాది జాషువా అని చంద్రబాబు సామాజిక మధ్యమం ఎక్స్‌లో కూడా పొందుపరిచారు. సమసమాజ నిర్మాణ స్ఫూర్తి ప్రదాత అని పేర్కొన్నారు. ఆ దార్శనికుని సంఘ సంస్కరణ పోరాటాన్ని,ఆ మహాకవి సాహితీ సేవను స్మరించుకుందామని తెలిపారు.

'విద్యా' పరిషత్ సంస్థలను స్వాధీనం చేసుకోవాలి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు వి. శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మచిలీపట్నంలో ఆంధ్ర జాతీయ విద్యా పరిసత్ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యా సంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడపాలని, అక్కడ జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన శనివారం లేఖ రాశారు. జాతీయ స్ఫూర్తితో స్వదేశీ విద్యకు తగిన ప్రోత్సాహం ఇవ్వాలనే సదాశయంతో స్వాతంత్ర్య సమరయోధులు కొంతమంది ఆంధ్ర జాతీయ విద్యా పరిషత్‌ను, అనుబంధ విద్యాసంస్థలను స్థాపించారని తెలిపారు. దీనికి 365 ఎకరాల విలువైన భూమి, భవనాలు ఉన్నాయని పేర్కొన్నారు. కానీ ఇప్పుడు ఈ విద్యాసంస్థలు అవినీతి, అక్రమాలకు నిలయంగా మారాయని తెలిపారు. వీటికి ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్‌గా కొనసాగుతున్న కోపల్లె హనుమంతరావు కేంద్ర బిందువుగా ఉన్నారని వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. అతను పోలీసుశాఖలో పనిచేస్తూ ఈ విద్యాసంస్థలకు వారసుడిగా కూడా చలామణి అవుతున్నారని తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు రూపొందించిన మెమోరాండం ఆఫ్ ఆర్టికల్స్‌లో వ్యవస్థాపక కుటుంబ సభ్యులకు వారసత్వ హక్కులు ఉండవని పేర్కొన్నప్పటికీ అక్రమంగా ఆయన కొనసాగుతున్నారని తెలుస్తోందని తెలిపారు. దీనిపై విచారణ జరిపి తగుచర్యలు తీసుకోవాలని కోరారు. ఎజె కళాశాలలో టీచింగ్ స్టాఫ్ నియామకంలో రోస్టర్ పాయింట్లు నిర్ణయించకపోవడంపై విజిలెన్స్ దర్యాప్తు జరిగిందని తెలిపారు. దానికి సంబంధించిన నివేదిక ఇంతవరకు వెలువడలేదని పేర్కొన్నారు.

ఎయిడెడ్ బిఇడిని అన్ ఎయిడెడ్ బిఇడిగా మార్చారని పేర్కొన్నారు. యుజిసి వారికి తెలియజేయకపోవడంతో వచ్చిన గ్రాంటును నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేశారని తెలిపారు. స్టాఫ్‌కు ఇచ్చే జీతాలు ఇష్టానుసారంగా తగ్గించి వేశారని పేర్కొన్నారు. ఇంకా అనేక ఆరోపణలు వస్తున్నాయని వివరించారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఈ విద్యాసంస్థను స్వాధీనం చేసుకుని కొత్త కోర్సులను ప్రవేశపెట్టి కృష్ణాజిల్లాలో పేద విద్యార్థులకు ఉచిత విద్యనందించడానికి కృషి చేయాలని శ్రీనివాసరావు కోరారు.

నిరసనకు దిగిన వరద బాధితులు

- న్యాయం చేయాలని కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- మద్దతు తెలిపిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వరద బాధితులు శనివారం నిరసనకు దిగారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తులతో కలెక్టరేట్ వద్దకు వచ్చిన బాధితులను అధికారులు గేటు వద్దే అడ్డుకున్నారు. దీంతో బాధితులు ఆగ్రహంతో నిరసనకు దిగారు. బుడమేరు, కృష్ణానది వరదలతో సర్వస్వం కోల్పోయి 28 రోజులు గడిచినా నేటికీ తమకు న్యాయం జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్యుమరేషన్‌లో తమ పేర్లు నమోదు కాలేదని, నమోదైన వారికి డబ్బు విడుదల కాలేదని, డబ్బులు విడుదలైనా తప్పుగా నమోదు చేశారని, ఇలా పలు సాకులతో బ్యాంకులో డబ్బులు ఇవ్వడం లేదని ఆందోళన చేపట్టారు.

ఎన్యుమరేషన్ తప్పులు తడకగా ఉందని, లోపాలను గుర్తించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల ఆందోళనకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ తదితరులు మద్దతు తెలిపారు. బాధితుల సమస్యలను కలెక్టర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. బాధితుల దరఖాస్తులు తీసుకొని విచారించి న్యాయం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా సిహెచ్.బాబురావు, డివి.కృష్ణ మాట్లాడారు. వరద బాధితులకు నష్టపరిహారం విషయంలో ముఖ్యమంత్రి, ప్రభుత్వం చెబుతున్న మాటలకు పొంతన ఉండడం లేదన్నారు. మళ్లీ సచివాలయాల వద్ద దరఖాస్తులు స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక సాయాన్ని ప్రతి కుటుంబానికీ రూ.50 వేలకు పెంచాలని, అన్ని రకాల వాహనాలకు సహాయం అందించాలని, చిరు వ్యాపారులు, చిన్న, మధ్యతరగతి సంస్థలు, పరిశ్రమలకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు మద్దతు తెలిపిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీదేవి, పివి.ఆంజనేయులు, కోట కళ్యాణ్ ఉన్నారు.



ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వరద బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సిహెచ్.బాబూరావు

న్యాయవాదుల సంక్షేమం కోసం కొత్త రూ.250 స్టాంప్

- రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి

న్యాయవాదుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ రూ.250 స్టాంపుని తీసుకొచ్చింది. న్యాయవాదులు, కక్షిదారులు దాఖలు చేసే కేసులకు సంబంధించిన వకాలత్‌లు, మెమో ఆఫ్ ఆపీరియన్స్ కోసం ఈ రూ.250 స్టాంప్‌ని వినియోగించాల్సివుంటుంది. బార్ కౌన్సిల్ ఆఫీసులో శనివారం జరిగిన కార్యక్రమంలో చైర్మన్ నల్లారి ద్వారాకనాథ రెడ్డి, ఉపాధ్యక్షుడు కష్ణ మోహన్, ఇతర సభ్యులు ఈ స్టాంప్‌ని ఆవిష్కరించారు. ద్వారకానాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని న్యాయవాద సంఘాలు ఇకపై ఈ రూ.250 స్టాంప్‌ని వినియోగించాలని కోరారు. ఈ స్టాంప్‌లను బార్ కౌన్సిల్ నుంచి పొందవచ్చునని సూచించారు. వీటి విక్రయం ద్వారా వచ్చిన నిధులను న్యాయవాదులు, వారి క్లర్కుల సంక్షేమం కోసం వినియోగిస్తామని తెలిపారు.

పల్లెపల్లెకు ప్రాయశ్చిత దీక్ష

- పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రాయశ్చిత దీక్షను పల్లె పల్లెకు తీసుకెళ్ళాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ట్విట్టర్‌లో ఆయన పోస్ట్ చేశారు. సెప్టెంబరు 30న రాష్ట్ర వ్యాప్తంగా దీపారాధన, అక్టోబరు1న ఓం నమో నారాయణాయ మంత్ర పఠనం, 2న నగర సంకీర్తన, 3న ఆలయాల్లో భజన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఎమ్మెల్యే కొలికిపూడిపై చర్యలు తీసుకోండి

- ముఖ్యమంత్రికి ఎపిడబ్ల్యుజెఎఫ్ ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇళ్ల మీదికి వచ్చి భౌతిక దాడులకు పాల్పడితే మీకు దిక్కెవరని జర్నలిస్టులపై బహిరంగంగా బెదిరింపులకు పాల్పడుతున్న తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం తిరువూరు జర్నలిస్టులతో కలిసి ఎపిడబ్ల్యుజెఎఫ్ మంగళగిరిలోని ఎన్‌టిఆర్ భవన్‌లో టిడిపి జాతీయ అధ్యక్షులు, సిఎం నారా చంద్రబాబునాయుడుకు, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కు ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యు జెఎఫ్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్ వెంకట్రావ్, జి ఆంజనేయులు తిరువూరులో కొలికపూడి శ్రీనివాసరావు దౌర్జన్యాలను వివరించారు. జర్నలిస్టుల అనుచితంగా ప్రవర్తించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తిరువూరులో ఏమి జరుగుతుందో తమ దృష్టికి వచ్చిందని ఆయనపై తగిన చర్యలను తీసుకుంటామని సిఎం చంద్రబాబునాయుడు, పల్లా శ్రీనివాసరావులు ఈ సందర్భంగా ఎపిడబ్ల్యు జెఎఫ్ ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి గోరంట్లప్ప, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కలిమిశ్రీ, ఎమ్‌బి నాథన్, జిల్లా నాయకులు రాఘవులు, ఎంవి నారాయణ, బద్రి, బి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విలీనానికి సాంకేతిక సమస్యలు

- 'ఉక్కు' ఉద్యోగులను తొలగించక తప్పదు
- నిధులు వెచ్చించే స్థితిలో కేంద్రం లేదు
- కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో విలీనం చేసేందుకు సాంకేతిక సమస్యలున్నాయని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శనివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ప్యాకేజీలతో తాత్కాలిక ఉపశమన చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారానికి పనిచేస్తున్నామని చెప్పారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ నష్టాలను భరించడం కేంద్ర ప్రభుత్వానికి అసాధ్యమని, ప్రస్తుత పరిస్థితుల్లో కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించక తప్పదని ఆయన తేల్చి చెప్పారు. విలీనానికి సంబంధించిన సాంకేతిక సమస్యల అంశంపై సెయిల్ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. సెయిల్, ఎన్‌ఎండిసి అధికారులతో తాను సమావేశమయ్యాయని తెలిపారు. ఆర్‌ఐఎన్‌ఎల్‌కు చెందిన 1,500 ఎకరాల భూమిని ఎన్‌ఎండిసికి బదలాయించి ఆర్థిక ఇబ్బందులను తొలగిస్తే ఎలా ఉంటుందనే అంశంపై ప్రధానంగా చర్చించామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, ఉత్పత్తి తక్కువగా ఉందన్నారు. కాగా వైసిపి అధికారంలోకి వచ్చాక తిరుపతి ప్రతిష్ఠ దిగజారిందని కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ అన్నారు. తిరుమల విషయంలో అవసరమైతే కేంద్రం జోక్యం చేసుకుంటుందని, లడ్డు వివాదంపై ఇప్పటికే కేంద్రం వివరాలను ఆరా తీసిందన్నారు. ఈ విషయంలో కేంద్రం కూడా సీరియస్‌గా ఉందన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

- ఘనంగా ముగిసిన దసరా సాంస్కృతికోత్సవాలు



దసరా సాంస్కృతికోత్సవ సంబరాల ముగింపు వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక, సామాజిక, క్రీడాంశాలలో నైపుణ్యాలు పెంచుకోవాలని శాసన సభ్యులు గద్దె రామమోహన్ అన్నారు. సేఫ్, ఎంబివికెతో పాటు వివిధ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా సాంస్కృతికోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం సాయంత్రం విజయవాడ మొగల్‌రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్దె రామమోహన్ హాజరై మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి వారు సన్మార్గంలో నడిచేందుకు ఇలాంటి సాంస్కృతిక పోటీలు దోహదం చేస్తాయన్నారు. ఇలాంటి పోటీల్లో యువత పాల్గొని నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు చక్కటి విజ్ఞానాన్ని పెంపొందించుకొని ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఆకాంక్షించారు. మూడు రోజులపాటు చక్కటి కార్యక్రమాలను నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ దసరా అంటే ఎంతో విశిష్టత ఉందని.. అయితే, నాటి దసరా కాంతులు ఇప్పుడు లేవన్నారు. నేటితరం విద్యార్థులకు మన సంస్కృతిని తెలియజేయడంతోపాటు వారిని సన్మార్గంలో పయనింపజేయాలన్న ఉద్దేశంతోనే దసరా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. దసరా ఉత్సవాల్లో విద్యా సంస్థల నుండి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దార్థ మహిళా డిగ్రీ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ డాక్టర్ టి.విజయలక్ష్మి, సిద్దార్థ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ కల్పన, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పద్మజ, సిద్ధార్థ బిఇడి కళాశాల ప్రిన్సిపల్ సశేషశ్రీ, సేఫ్ అధ్యక్షులు జ్యోత్స్న, నిర్వహణా కమిటీ సభ్యులు స్వరూపారాణి, పి.విజయ, ప్రముఖ రచయిత్రి సత్యవతి, వసుంధర, ఎ.కుసుమ, ఝాన్సి, ఎ.సంధ్య, ఎ.కుసుమ, ఎ.పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యసాధనలో రాష్ట్రం ముందడుగు

- అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజారోగ్య పరిరక్షణకు సంబంధించి ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనలో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసిందని అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం రాష్ట్రీయ కిషోర్ స్వాస్త్య కార్యక్రమం, కౌమార బాల బాలికల కౌన్సిలర్ల శిక్షణకు సంబంధించిన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి ప్రతి లక్ష శిశు జననాలకు, శిశు మరణాల రేటుని 70 కంటే తక్కువకు తగ్గించాలనే సుస్థిర అభివృద్ధి లక్ష్యాన్ని రాష్ట్రం సాధించిందన్నారు. ఇందుకు అదనంగా రాష్ట్రం ప్రస్తుతం ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల రేటు తగ్గింపు విషయంలో కూడా లక్ష్యసాధనకు చేరువలో ఉందన్నారు. దేశంలో ప్రతి లక్ష సజీవ జననాలకు ప్రసూతి మరణాల రేటు 97గా ఉందని, రాష్ట్రంలో లక్ష సజీవ జననాలకు 45 ఎంఎంఆర్ రేటుతో దేశంలో 4వస్థానంలో నిలిచిందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో యునిసెఫ్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ సలీమా భట్టా, ఆర్‌కెఎస్‌కె స్టేట్ ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ సిహెచ్ నిర్మలా గ్లోరీ, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జనార్ధనం, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిది డాక్టర్ సురేష్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 77మంది కౌన్సెలర్లు పాల్గొన్నారు.

సహజ వనరుల దోపిడిపై సిబిఐ విచారణ

- వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి హయాంలో జరిగిన మైనింగ్ దోపిడీపై ఎసిబి విచారణతో పాటు పూర్తి స్థాయిలో సమగ్ర దర్యాప్తు జరపాలని, అదే విధంగా సహజ వనరుల దోపిడిపై సిబిఐతో విచారణ జరిపించాలని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె శనివారం ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన దోపిడీపై ఆ నాటి మైనింగ్ ఎండి వెంకటరెడ్డి లాంటి వారే కాకుండా, ప్యాలెస్‌లో ఉన్న తెరవెనుక సర్వం తానై వేల కోట్లు కాజేసిన ఆ ఘనాపాటి ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. ఐదేళ్లుగా అస్మదీయ కంపెనీలకు మైనింగ్ కాంట్రాక్టులిచ్చి అడ్డ గోలుగా సహజ సంపదను దోచుకుతిన్నారని ఆమె ఆరోపించారు.

'ఉక్కు' కార్మికుల జోలికొస్తే ఊరుకోం..

(మొదటిపేజీ తరువాయి)

డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్లాంట్‌లో రిటైర్ అవుతున్న వారి స్థానంలో ఐదేళ్లలో కొత్తవారిని రిక్రూట్ చేయడం లేదన్నారు. నానాటికీ కార్మికుల, ఉద్యోగుల సంఖ్య తగ్గుతున్న క్రమంలో ఉన్నవారిపై పని ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. ఈ తరుణంలో కొత్త కార్మికులను రిక్రూట్‌మెంట్ చేయాల్సిందిపోయి, ఉన్నవారిని తొలగించేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. 'ప్లాంటును రక్షిస్తాం... కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తాం..' అన్న రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం చర్యలను ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. సెయిల్‌లో విలీనం చేస్తామని ప్రకటనలు గుప్పిస్తూనే కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కేంద్రంలోని మోడీ సర్కారు కుతంత్రాలను కార్మికులు అర్థం చేసుకుంటున్నారని కోరారు. ప్లాంట్‌ను కావాలనే నష్టాలవైపు నెడుతూ కోలుకోలేని దెబ్బతీస్తోందని వివరించారు. ప్రస్తుతం ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌ను మాత్రమే నడుపుతూ, కొన్ని విభాగాలను మూసివేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ లోపల కాంట్రాక్ట్ కార్మికులు అన్ని విభాగాల్లోనూ సమావేశాలు నిర్వహించారు. నాలుగు వేల మందిని తొలగించడానికి యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

ఉక్కు పరిరక్షణకు విద్యార్థులు ఉద్యమించాలి
- ఎయులో విద్యార్థుల మేధోమథన సదస్సులో వక్తలు

విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి జరిగిన పోరాటాల్లో ఆంధ్రా యూనివర్సిటీ, ఎవిఎన్ కాలేజీ విద్యార్థులు కీలకపాత్ర పోషించారని, నేడు స్టీల్‌ప్లాంట్‌ను ఎవడికో అమ్మేస్తాం, మూసేస్తాం అంటే విద్యార్థులు, యువకులు చూస్తూ ఊరుకోకూడదని, దాని పరిరక్షణకు ఉద్యమించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని ఎయు టిఎల్ఎన్ సభా హాల్‌లో సేవ్ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ స్టూడెంట్ ఫోరమ్ ఆధ్వర్యాన విద్యార్థుల మేధో మథన సదస్సు శనివారం జరిగింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్, నాడు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు జరిగిన ఉద్యమంలో పాల్గొన్న నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు ముఖ్య వక్తలుగా హాజరయ్యారు. వారు ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సొంతగనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాటి ఉక్కు పోరాట చరిత్రను, నేడు స్టీల్‌ప్లాంట్‌పై జరుగుతున్న కుట్రలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, పూర్వ నాయకులు డాక్టర్ బి.గంగారావు, బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

బొజ్జా తారకం సతీమణి విజయ భారతి కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

విజయభారతి భౌతికకాయాన్ని ఆదివారం మధ్యాహ్నం వరకు ఇంటి వద్దే ఉంచ నున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యంలో ఆమె ఎంతో కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. విజయ భారతి తూర్పు గోదా వరి జిల్లా రాజోలులో 1941లో జన్మించారు. ఈమె తండ్రి ప్రముఖ రచయిత బోయి భీమన్న. తల్లి నాగరత్నమ్మ. విజయభారతి కోఠీలోని ఉస్మానియా విశ్వవిద్యాలయం మహిళా కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం-సాంఘిక పరిస్థితులు అనే అంశపై పరిశోధన చేసి డాక్టరేట్ పొం దారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగులో డాక్టరేట్ పొందిన మొట్ట మొదటి దళిత మహిళ విజయభారతే! తెలుగు అకాడమీలో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రాచీన సాహిత్య కోశం, ఆధునిక సాహిత్యకోశం విజయభారతి సంపాదకత్వంలోనే అకాడమి ముద్రించింది. 1968లో విజయభారతికి ప్రముఖ హేతువావి, పౌరహక్కుల నేత బొజ్జాతారకంతో వివాహం జరిగింది. కుల వ్యవస్థ స్వరూప స్వభావాల గురించి పురాణాలు, ఇతిహాసాలు ఆధారంగా విశ్లేషణలు చేస్తూ, ఆమె చేసిన పలు రచనలను హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురించింది. మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌లపై కూడా ఆమె పలు రచనలు చేశారు. ఆమె రాసిన షట్చక్రవర్తులు అనే పుస్తక సంకలాని 2003లో కెనడాలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ మిషనరీస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అవార్డులు వచ్చాయి. విజయ భారతి మృతి పట్ల తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, సిపిఎం ఆంధ్రప్రదేశ్ కమిటీతో పాటు పలువరు సంతాపం ప్రకటించారు.

తెలంగాణ సిఎం ప్రభృతుల సంతాపం

ప్రజాశక్తి- యంత్రాంగం

విజయభారతి మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ప్రముఖ రచయిత, కీర్తిశేషులు బోయి భీమన్న కుమార్తె అయిన ఆమె... తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా సేవలందించడంతో పాటుగా ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యంలో ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. రాహుల్ బొజ్జా, ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

సిపిఎం ప్రగాఢ సానుభూతి

విజయభారతి మృతి పట్ల సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించింది. బోయి భీమన్న కుమార్తెగా, మానవ హక్కుల కోసం నిరంతరం శ్రమించిన న్యాయవాది బొజ్జా తారకం సతీమణిగానే కాకుండా రచయితగా ప్రజల్లో తనకంటూ ఒక స్థానాన్ని ఆమె ఏర్పరచుకున్నారని పేర్కొంది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. విజయభారతి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

సామాజిక ఉద్యమాలకు తీరని లోటు : కెవిపిఎస్

విజయభారతి మృతి సామాజిక ఉద్యమాలకు తీరని లోటని కెవిపిఎస్ పేర్కొంది. దేశంలో అణగారిన వర్గాల అభివృద్ధికి పరితపించిన ఆమె... మహాత్మా జ్యోతీరావు పూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారని తెలిపింది. సామాజిక అంశాలపై ఎన్నో రచనలను చేశారని పేర్కొంది. ఈ మేరకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ఒక ప్రకటన విడుదల చేశారు.

మతతత్వంపై పలు రచనలు : సాహితీ స్రవంతి

విజయభారతి మృతి ప్రజాసాహిత్యానికి తీరని లోటని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెంగార మోహన్, సత్యరంజన్ పేర్కొన్నారు. మతతత్వం, సామాజిక అంశాలు, చరిత్ర అంశాల్లో పలు రచనలు చేశారని తెలిపారు. విజయభారతి మృతి పట్ల ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి, ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి సంతాపం ప్రకటించారు. సామాజిక కార్యకర్త, రచయిత కత్తి పద్మారావు, సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, పలువురు రచయితలు, మేధావులు, నాయకులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

అత్యాధునిక వైద్యంపై విస్తృత పరిశోధనలు

- అనస్తీషియా వైద్యుల సెమినార్‌లో వక్తలు

ప్రజాశక్తి - తిరుపతి

అత్యాధునిక వైద్యాన్ని అందించే దిశగా అనస్తీషియా విభాగంలో మరిన్ని పరిశోధనలు అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనస్తీషియా వైద్యుల 33వ వార్షిక సదస్సును తిరుపతిలోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ప్రారంభించారు. ఈ సదస్సుకు అనస్తీషియా వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉప్పువేటి తారక ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సిమ్స్ డైరెక్టర్ ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ... వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఆ దిశగా మరిన్ని పరిశోధనలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యరంగంలో అనస్తీషియా డాక్టర్లది ప్రధానమైన భూమిక అని ఉద్ఘాటించారు.

రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా యువ వైద్యులు కృషి చేయాలని కోరారు. ఈ సదస్సుకు గెస్ట్ ఆఫ్ హానర్‌గా నేషనల్ అకాడమిక్ చైర్మన్ డాక్టర్ ఎం వి భీమేశ్వర్ హాజరై.. అనస్తీషియా వైద్యుల విశిష్టతను వివరించారు. పలు కీలక అంశాలపై ప్రసంగించారు. పలు అంశాలపై సైంటిఫిక్ సెషన్, గ్రూప్ డిస్కషన్, ప్యానల్ డిస్కషన్లు నిర్వహించారు. ఈ సదస్సుకు తొమ్మిది మంది ఐఎస్ఎ నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్స్, ఎనిమిది మంది స్టేట్ పాస్ట్ ప్రెసిడెంట్‌తో పాటు 1000 మందికి పైగా అనస్తీషియా వైద్యులు హాజరయ్యారు. ఈ సదస్సులో ప్రముఖ వైద్యులు తోట ఫణీంద్రనాథ్, మణికంఠ, రాధా, ప్రదీప్ కుమార్, సూరిశెట్టి శ్రీనివాస్, చక్రరావు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న చంద్రచూడ్ కుటుంబం

తిరుచానూరు అమ్మవారి సేవలో సిజెఐ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

రెండురోజుల పర్యటన నిమిత్తం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ శనివారం తిరుపతి చేరుకున్నారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారిని సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న సిజెఐకు టిటిడి ఇఒ శ్యామలరావు స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం శ్రీవారిని సిజెఐ దర్శించుకోనున్నారు. తొలుత రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ పి.కృష్ణమోహన్, జస్టిస్ వై.లక్ష్మణరావు, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడు స్వాగతం పలికారు.

లోకో పైలెట్ల మెరుపు ధర్నా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎఐఎల్ఆర్ఎస్ఎ విజయవాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో కంబైన్డ్ క్రూ లాబీ వద్ద లోకో పైలెట్లు శనివారం ఆకస్మిక ధర్నా నిర్వహించారు. ఇప్పటి వరకు టూల్ కిట్స్‌ను బాక్స్ బాయ్స్ తీసుకుని వస్తుండగా ప్రస్తుతం రైల్వే శాఖ ఆ పోస్టులను రద్దు చేసింది. బాక్స్‌ల స్థానంలో ట్రాలీబ్యాగ్స్ ద్వారా కిట్స్‌ను లోకో పైలెట్లు మోసుకుపోవాలని చెప్పడాన్ని వ్యతిరేకిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎల్ఆర్ఎస్ఎ మాజీ డివిజన్ కార్యదర్శి గురుమూర్తి, జివిలూ, వెంకటేశన్, సిఐటియు రాష్ట్ర నాయకులు వివిఎల్ నరసింహులు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంలో జాషువా జయంతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమాజంలో అణగారిన ప్రజలకు జరిగిన అన్యాయాలను, మూఢాచారాలను తన కవితలతో గుర్రం జాషువా నిలదీశారని వైసిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. జాషువా జయంతి సందర్భంగా శనివారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. వైసిపి నేతలు కొమ్మూరి కనకారావు, అడసా శేషు తదితరులు జాషువాకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడారు. మూడాచారాలు, కులవివక్షతపై గళమెత్తి ఆధునిక కవిగా జాషువా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. తెలుగు సాహిత్యానికి ఆయన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల తొలగింపుపై

తాత్కాలికంగా కేంద్రం వెనక్కి!

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉక్కు కాంట్రాక్టు కార్మికులను తొలగించాలన్న నిర్ణయం నుంచి కేంద్రం ఆదేశాలతో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తాత్కాలికంగా వెనక్కి తగ్గింది. దీంతో, కార్మికులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ప్రమాదం పొంచే ఉందంటూ స్టీల్‌ప్లాంట్‌లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ నెల 27 సాయంత్రం విశాఖ ఉక్కు యాజమాన్యం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో సుమారు నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని, వారి గేట్‌పాస్‌లను వెనక్కి తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో, కార్మికులు తీవ్ర ఆందోళన చెందారు. శుక్రవారం అర్ధరాత్రి నాటికి విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సహా ఉన్నతాధికారులంతా ఉక్కు కాంట్రాక్టు కార్మికుల తొలగింపు విషయమై ఒక్కసారిగా ఉలిక్కిపడ్డట్టు సమాచారం. స్టీల్‌ప్లాంట్‌పై ఒకేసారి ఇలాంటి నిర్ణయం చేస్తే పరిస్థితులు అదుపు తప్పుతాయని, కార్మికవర్గం మూడేళ్లుగా చేస్తున్న పోరాట మరింత ఉధృతమవుతుందని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించినట్టు తెలుస్తోంది దీంతో, ముఖ్యమంత్రి



చంద్రబాబునాయుడు కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ అధికారులతో ఫోన్‌లో సంప్రదింపులు జరిపి ఇప్పటికే రాష్ట్రంలో పరిస్థితులు అట్టుడుకుతున్నాయని, ఉక్కు కార్మికుల ఆందోళనలు రాష్ట్రమంతటా చెలరేగే అవకాశాలున్నందున నిర్ణయాన్ని వాయిదా వేయాలని కోరినట్టు సమాచారం. దీంతో, స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి కేంద్రం నుంచి ఆదేశాలు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో శనివారం ఎవరి గేట్ పాస్‌లనూ వెనక్కి తీసుకోకపోవడంతో కార్మికులంతా ఎప్పటిలాగానే విధులకు హాజరయ్యారు. ఈ తాత్కాలిక ఉపశమనం కేవలం 15 రోజులపాటే ఉంటుందన్న చర్చ ఉక్కు కర్మాగారంలో కార్మికుల మధ్య నడుస్తోంది. మళ్లీ తొలగింపు నిర్ణయాన్ని యాజమాన్యం తిరగదోడి కార్మికులను వెనక్కి పంపించే అవకాశాలు లేకపోలేదని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మభ్యపెట్టే ప్రకటనలు

కేంద్రంలోని బిజెపి సర్కారు, రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కార్మికులను మభ్య పెట్టే ప్రకటనలను చేస్తుండడంపై పలువురు కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెయిల్‌లో విలీన ప్రక్రియ జరిగిపోయినట్టు, కేంద్రం రూ.2,500 కోట్ల రుణం ఇచ్చేస్తున్నట్టు, ప్రైవేటీకరణ ఆగిపోయినట్టు వార్తలు, ప్రచారాలు వస్తుండడంపై మండిపడుతున్నారు. ప్రైవేటీకరణ ప్రక్రియ ఆగిపోయిందని చెబుతున్న దానిలో వాస్తవం లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్ తెలిపారు. ఉక్కు ప్రైవేటీకరణ ఆగిపోయినట్టు కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు.

సామాజిక చైతన్యం కోసం రచనలు సాగించిన జాషువా

- జయంతి సభలో మంత్రి కందుల దుర్గేష్
- నలుగురికి కవి కోకిల పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి - విజయవాడ



సంజీవరావుకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న మంత్రి కందుల దురేష్

ఆధునిక తెలుగు కవుల్లో ప్రముఖ స్థానం పొందిన కవి గుర్రం జాషువా అని, సామాజిక చైతన్యం కోసం రచనలు సాగించారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యాన శనివారం ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన గుర్రం జాషువా 129వ జయంతి కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. జాషువా చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. 'కవి' మాసపత్రిక 50వ సంచికను ఆవిష్కరించారు. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కళా చిత్రాలను తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ తన కవితా ప్రతిభతో తెలుగు సాహితీ లోకంలో ప్రజ్వరిల్లిన తేజోమూర్తి, విశ్వమానవుడు గుర్రం జాషువా అని కీర్తించారు. సమాజంలో నెలకొన్న సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా తన రచనలు సాగించారని తెలిపారు. సామాజిక చైతన్యానికి పెద్దపీట వేసి సాహిత్య ప్రక్రియను సుసంపన్నం చేశారని కొనియాడారు. సామాజిక వ్యవస్థను బాగు చేయడానికి తపించారని వివరించారు. సాంఘిక దురాచారాలను అరికట్టేందుకు తన వంతు ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. సమకాలీన సమాజం పోకడలకు అద్దం పట్టిన కావ్యం గుర్రం జాషువా రచించిన గబ్బిలం అని అన్నారు. మనుషులంతా సమానమనే భావనను కలిగించారని చెప్పారు. జాషువా కవితలు మన జీవితాలను స్పృశిస్తాయని, మనిషి జీవితంలోని ఎత్తుపల్లాలను అంటరానితనమనే మనో వైఖల్యాలను వివరిస్తారని అన్నారు. సమాజ హితం కోరుకున్నారని చెప్పారు. జాషువా సాహిత్య వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ ఎంపిక చేసిన కర్రి సంజీవరావు (శిఖామణి), దుగ్గినపల్లి ఎజ్రా శాస్త్రి, టి.వరప్రసాద్, పి.రమణయ్యలకు గుర్రం జాషువా కవి కోకిల పురస్కారం -2024 ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఒక్కో పురస్కార గ్రహీతకు జ్ఞాపికతోపాటు రూ.50 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో యువజనాభ్యుదయం, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి వాడ్రెవు వినయ్ చంద్, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు ఎ. శ్రీనివాస్, పూర్వ సంచాలకులు మల్లికార్జున్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ...

- హోంశాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుమల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఎటువంటి అల్లర్లకు తావులేకుండా , శాంతి భద్రతల పరిరక్షణ కోసమే సెక్షన్ 30ని అమలు చేసినట్లు హోంశాఖమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దీనిని ప్రజల్లోకి తప్పుగా తీసుకెళ్లడానికి మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పచ్చి అబద్దాలు చెబుతున్నారని అన్నారు. జగన్ తిరుమలకు వెడుతున్నట్లు ప్రకటించడంతో వైసిపి నేతలు భారీ జనసమీకరణకు సిద్ధమయ్యారని. మరోవైపు జగన్‌ను అడ్డుకుంటామని ధార్మిక సంఘ నేతలు చెప్పారని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు, భక్తులకు ఇబ్బంది కలగకూడదని సెక్షన్ 30 నోటీసులు ఇచ్చారని తెలిపారు. కుంటిసాకుతో జగన్ తిరుమలకు ఆగిపోయారని పేర్కొన్నారు.

అమాయకత్వంగా నటిస్తున్న జగన్

డిక్లరేషన్ ఇవ్వడం ఇష్టం లేకనే జగన్ తిరుపతి పర్యటన రద్దు చేసుకొని తన మతం మానవత్వం అంటూ అమాయకత్వం నటిస్తున్నారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి విమర్శించారు. దళితుడైన సుబ్రహ్మణ్యంను తన పార్టీ ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి డోర్ డెలివరీ చేసినప్పుడు మానవత్వం ఏమైందని శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో సునీత కన్నీరు కార్చినప్పుడు, అన్న క్యాంటీన్లు రద్దు చేసి పేదల పొట్ట కొట్టినప్పుడు మానవతం ఏమైందని నిలదీశారు.



సన్యాసిరావు సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజా గాయకుడు సన్యాసిరావు

- సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

నిబద్ధత కలిగిన వ్యక్తి ప్రజానాట్య మండలి సీనియర్ కళాకారుడు, రచయిత జి.సన్యాసిరావు అని పలువురు వక్తలు అన్నారు. సన్యాసిరావు సంస్మరణ సభ విశాఖలోని గాజువాక లయన్స్ క్లబ్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ సన్యాసిరావు ప్రజా గాయకునిగా, రచయితగా ఎన్నో పాటలు రాసి పాడారని తెలిపారు. ఆయన లేని సభ, ఉద్యమం, ఆందోళన విశాఖలో లేవంటే అతిశయోక్తి కాదన్నారు. పాటే ప్రాణంగా సాగారని తెలిపారు. ఆయన భౌతికకాయాన్ని సైతం వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం కెజిహెచ్‌కు అప్పగించి పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ సన్యాసిరావు పాటలు సామాజిక, రాజకీయ చైతన్యం కలిగించేవిగా ఉండేవని తెలిపారు. ప్రభుత్వాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఆయన పాటలు దునుమాడేవన్నారు. పార్టీ సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉద్యమానికి పాటలతో సన్యాసిరావు ఉత్తేజాన్ని ఇచ్చారన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు మంగరాజు మాట్లాడుతూ సన్యాసిరావు భౌతికంగా లేకపోయినా, అక్షరం బతికున్నంత వరకూ సమాజంలో సజీవంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. సన్యాసిరావుపై ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచికను సభలో ఆవిష్కరించారు.

గంజాయి విక్రేత అరెస్టు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పల్నాడు జిల్లా నరసరావుపేట పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 4.5 కిలోల గంజాయితోపాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. డిఎస్‌పి కె నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేట పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన డ్యాన్సర్ ఉప్పుతోళ్ల తిరుపతయ్య గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో సిఐ హైమారావు తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. తహశీల్దార్ సమక్షంలో పూర్తి ఆధారాలతో తిరుపతయ్యను అరెస్టు చేశారు. విశాఖపట్నం నుండి గంజాయిని తీసుకొచ్చి నరసరావుపేటలో అమ్ముతున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. నిందితుడిపై ఇప్పటికే గంజాయి కేసులు ఉన్నాయని తెలిపారు. నరసరావుపేట బిసి కాలనీలో కూడా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉందని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి త్వరలో నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

తమిళనాడులో టాటా మోటార్స్ భారీ ప్లాంట్

- శంకుస్థాపన చేసిన సిఎం స్టాలిన్
- రూ.9,000 కోట్ల పెట్టుబడులు



చెన్నయ్ : దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ తమిళనాడులో అతిపెద్ద తయారీ ప్లాంట్ నెలకొల్పడానికి ముందుకు వచ్చింది. చెన్నయ్‌కి 115 కిలోమీటర్ల దూరంలోని రాణిపేటలో రూ.9000 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేస్తోన్న తయారీ కేంద్రానికి శనివారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ శంకుస్థాపన చేశారు. ఈ ప్లాంట్‌లో టాటా మోటార్స్, జాగ్వర్ లాండ్ రోహర్ (జెఎల్ఆర్) వాహనాలను తయారు చేయనుంది. ఇక్కడ తయారయ్యే వాహనాలను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించనుంది. తమిళనాడు ప్రభుత్వంతో టాటా మోటార్స్ చేసుకున్న ఒప్పందం ప్రకారం.. వచ్చే ఐదేళ్లలో రూ.9,000 కోట్లను పెట్టుబడి పెట్టనుంది. సుమారు 5000 ఉద్యోగాలను కల్పించనుంది. "ఎలక్ట్రిక్, లగ్జరీ వాహనాలతో సహ తర్వాతి తరం కార్లు, ఎస్‌యువిలను ఇక్కడ తయారు చేయనున్నాం. తమిళనాడు ప్రగతిశీల విధానాలతో ప్రముఖ పారిశ్రామిక రాష్ట్రంగా ఉంది. అనేక టాటా గ్రూప్ కంపెనీలు ఇక్కడ నుండి విజయవంతంగా పని చేస్తున్నాయి. మహిళా సాధికారతయ కల్పించే దిశగా చర్యలు తీసుకుంటాము. దశలవారీగా ఈ తయారీ కేంద్రం అందుబాటులోకి రానుంది. ఏడాదికి 2.50 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యంలతో దీన్ని ఏర్పాటు చేస్తున్నాము." అని చంద్ర శేఖరన్ తెలిపారు.

ఉద్యోగులకు ఐఆర్, డిఎ ప్రకటించండి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ దసరా కానుకగా ఐఆర్, డిఎను ప్రభుత్వం ప్రకటించాలనిఏపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు రవీంద్ర రాజు, అప్పలనాయుడు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అదే విధంగా దశల వారీగా పెండింగ్ బిల్లులు, ఇతర సమస్యలు కూడా పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామ వార్డు సచివాల యాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలుపుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులివ్వడంపట్ల విఆర్ఓల సంఘం హర్షం వ్యక్తం చేసింది.

చంద్రబాబు కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలి

- మాజీ ఎంపి మార్గాని భరత్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుపతి లడ్డూపై చంద్రబాబు కుటిల రాజకీయాలను, కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని వైసిపి అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మార్గాని భరత్ కోరారు. చంద్రబాబు లడ్డుపై చెప్పింది అబద్ధాలు అని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బట్టబయలు చేశారని తెలిపారు. శనివారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వెంకటేశ్వరస్వామి ప్రతిష్టపై చంద్రబాబునాయుడు చాలా పెద్ద నింద వేశారన్నారు. ఆ నిందారోపణలు పోగొట్టేందుకే రాష్ట్రవ్యాప్తంగా వైసిపి శ్రేణులు దేవాలయాల్లో పూజలు చేశారని తెలిపారు.

పెట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టిలోకి తేవాలి

- బిజెపియేతర రాష్ట్రాల విముఖత
- మంత్రి హర్దీప్ సింగ్



న్యూఢిల్లీ : పెట్రోల్, డీజిల్ ఇంధనాలను వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) పరిధిలోకి తీసుకురావాలని పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ అన్నారు. అయితే అదనపు వ్యాట్‌ను వదులుకోవడానికి బిజెపియేతర రాష్ట్రాలు సుముఖంగా లేవని పేర్కొన్నారు. దీనిపై ఏకాభిప్రాయం సాధించాల్సిన అవసరం ఉందన్నారు. పూణె ఇంటర్నేషనల్ సెంటర్ 14వ వ్యవస్థాపక దినోత్సవంలో మంత్రి మాట్లాడుతూ.. పెట్రోలు, డీజిల్ జిఎస్‌టి పరిధిలోకి రావాలని తాను చాలా కాలంగా వాదిస్తున్నానని అన్నారు. ఇంధన భద్రతను పెంపొందించడానికి భారత్ వ్యూహాత్మక నిల్వలపై దృష్టి సారిస్తుందన్నారు. దిగు మతి చేసుకున్న ఇంధనంపై అధికంగా ఆధార పడటాన్ని తగ్గించడానికి అన్వేషించాలన్నారు. రాష్ట్రాలకు వాస్తవానికి మద్యం, ఇంధనం ప్రధాన ఆదాయ వనరులుగా ఉండటంతో ఆ రెండింటిని జిఎస్‌టిలోకి చేర్చడానికి ఆనాసక్తిని చూపుతున్నాయన్నారు. జిఎస్‌టి కౌన్సిల్ సమావేశాల్లోనూ ఇది పలు సార్లు చర్చకు వచ్చిందన్నారు.

పారదర్శకంగా బదిలీలు

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో పారదర్శకంగా బదిలీలను నిర్వహించనున్నట్లు ఆ శాఖ మంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. కూటమి పాలన వంద రోజులు పూర్తయిన సందర్భంగా శని వారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ ప్రక్రియను పారదర్శకంగా, పక్షపాత రహితంగా నిర్వహించాలని ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేసినట్లు ఆయన తెలిపారు. శాసనసభ సమావేశాల్లో, మంత్రి మండలి సమావేశాల్లో కూటమి ప్రభుత్వం ఆశ్రిత పక్షపాతం లేకుండా ప్రజలకు మేలు చేస్తుందని సిఎం ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.4,500కోట్లు ఉపాధి హామీ నిధులను వంద రోజుల్లోపే రాష్ట్ర ప్రభుత్వం రాబట్టగలిగిందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,987 కోట్లు వచ్చాయని, 2027 నాటికి జల్‌జీవన్ మిషన్‌ద్వారా రూ.95.44 లక్షల ఇళ్లకు కుళాయిల ద్వారా రక్షిత నీరు నిరంతరాయంగా సరఫరా చేయాలనేది తమ లక్ష్యమని తెలిపారు. గ్రామ స్థాయిలో మౌలిక వసతుల కల్పన, స్థానిక పాలనలో ప్రజా భాగస్వామ్యం ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని, ఇందుకు ఉద్యోగుల శక్తికి ప్రోత్సాహాన్ని అందించాలన్నారు.

మానవత్వంపై జగన్ మాటలు హాస్యాస్పదం

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

మానవత్వం గురించి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా అనిపించిందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సొంత పార్టీ ఎంపిని పోలీసులతో కొట్టించినప్పుడు మానవత్వం ఏమైందని ప్రశ్నించారు. బిజెపితో అంటకాగిన జగన్.. అధికారం కోల్పోయ్యాక సెక్యులరిజం, దళితులు గురించి మాట్లాడడం వింతగా ఉందన్నారు. ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి కేంద్ర ప్రభుత్వం సరిగ్గా వైద్యం అందించలేదని ఆరోపించారు. టిటిడి అన్న ప్రసాదాలకు అవసరమైన నెయ్యిని తిరుపతి పరిసర ప్రాంతాల్లో నిరుద్యోగులుగా ఉన్న వారికి ఆవులను సబ్సిడీ ద్వారా ఇప్పించి అవసరమైన నెయ్యిని స్థానికంగానే సమకూర్చుకునేలా టిటిడి ఇఒ, అధికారులు ఆలోచన చేయాలని సూచించారు. టిటిడి బోర్డు ద్వారా తీసుకున్న నిర్ణయాలను మాత్రమే ఉద్యోగులు అమలు చేస్తుంటారని, అలాంటి వారిని నోటీసుల పేరుతో ఇబ్బందులు పెట్టాలని చూస్తే ఊరుకోమన్నారు.

సెప్టెంబర్‌లో రూ.57వేల కోట్ల ఎఫ్‌పిఐలు



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు విదేశీ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆచితూచి వ్యవహరించిన విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పిఐ)లు ప్రస్తుతం సెప్టెంబర్‌లో ఇప్పటి వరకు నికరంగా రూ.57,359 కోట్ల ఈక్విటీలను కొనుగోలు చేశారు. తొమ్మిది నెలల్లో ఈ స్థాయిలో పెట్టుబడులు రావడం ఇదే తొలిసారి. 2024 జనవరిలో రూ.25,744 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించగా.. ఫిబ్రవరిలో రూ.1539 కోట్లు, మార్చిలో రూ.35,098 కోట్లు నికరంగా పెట్టుబడులు నమోదయ్యాయి. ఏప్రిల్‌లో రూ.8,671 కోట్లు, మే నెలలో రూ.25,586 కోట్లు చొప్పున నిధులు తరలిపోయాయి. జూన్‌లో రూ.25,565 కోట్లు, జులైలో రూ.32,359 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేశారు. ఆగస్టులో రూ.7,322 కోట్ల విలువైన పెట్టుబడులను కుమ్మరించడంతో ఇప్పటి వరకు నికరంగా రూ.1 లక్ష కోట్ల పైనా ఎఫ్‌పిఐలు నమోదయ్యాయి.

బ్లాక్ టికెట్లకు పాల్పడిన బుక్ మై షో సిఇఒ..!

ముంబయి : ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ బుక్ మై షో సిఇఒ, సహ వ్యవస్థాపకుడు అశీష్ హేమరాజని బ్లాక్ టికెట్లకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. బ్రిటిష్ రాక్ బ్యాండ్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన టికెట్లను బ్లాక్‌లో విక్రయించారని తెలుస్తోంది. దీంతో ముంబయి పోలీసులు ఆయనతో పాటు కంపెనీ టెక్నికల్ హెడ్‌కు నోటీసులు జారీ చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. బ్రిటిష్ రాక్ బ్యాండ్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరిలో 19 నుంచి 21 వరకు నవీ ముంబయిలోని డివై పాటిల్ స్టేడియంలో కోల్డ్ ప్లే కార్యక్రమం జరగనుంది. ఈ ప్రోగ్రామ్ టికెట్ల విక్రయం బ్లాక్‌లో జరిగినట్లుగా ఆరోపణలు వస్తున్నాయి.

గంగమ్మ గుడిలో వైసిపి 'సంప్రోక్షణ'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరుమల పర్యటనను టిడిపి నేతలు రాజకీయం చేశారని తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, వైసిపి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. తిరుమల పర్యటనకు జగన్ వస్తున్న సందర్భంగా ఎప్పుడూ లేని విధంగా తిరుమలలో డిక్లరేషన్ బోర్డులు ఏర్పాటు చేశారని, పర్యటన రద్దు అయ్యిందని తెలియగానే వాటిని తొలగించారన్నారు. ఇది రాజకీయం కాదా? అని నిలదీశారు. తిరుమల ప్రసాదంపై సిఎం చంద్రబాబునాయుడు అపవిత్రమైన కామెంట్స్‌ను నిరసిస్తూ, వైసిపి పిలుపు మేరకు తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిలో వైసిపి ఆధ్వర్యంలో సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు.

సంపాదకీయం

అసమతుల్యత

'ఎక్కడమ్మా నువ్వు లేనిది?/ ఏమిటీ నువ్ చేయలేనిదీ?/...వ్యవసాయంలో నువు లేకుంటే/ నోటికాడికి కూడే రాదు/ ...సమాజ గమనం నువు లేకుంటే గతితప్పి గంగపాలవుతుంది' అంటారు కవి దేవేంద్ర. భూస్వామ్య సమాజం స్త్రీని సొంత ఆస్తిగా, వంటింటికే పరిమితంజేసి, జీతంలేని పనిమనిషిగా చేస్తే... పెట్టుబడిదారీ విధానం స్త్రీ ఉనికినే సరుకుగా మార్చింది. దేశ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం పెరగడంతో పాటు వారి 'పని-జీవితం' మధ్య అసమతుల్యత కూడా అంతే వేగంగా పెరుగుతోంది. స్త్రీ పురుషులిద్దరూ ఒకేలాంటి ఉద్యోగం చేస్తున్నా... ఇంటా బయటా పురుషుని ఉద్యోగానికి, ప్రమోషన్‌కు వున్న ప్రాధాన్యత స్త్రీకి వుండదు. 'ఆర్థిక స్వేచ్ఛ, ఆత్మగౌరవం, స్వంత ఆలోచన, స్వయం నిర్ణయ శక్తి, స్త్రీల ప్రగతికి దోహదం చేస్తాయ'ని యునెస్కో-2002లో ప్రచురించిన 'జెండర్ సెన్సిటివిటీ-ఎ ట్రైనింగ్ మాన్యువల్' నివేదిస్తోంది. కానీ, ఆచరణలో స్త్రీ జీవితం- శ్రమ మధ్య సమతుల్యతలో తీవ్రమైన అంతరం వుంది. ఈ తరం పురుషులు కొందరు ఇంటిపనిలో భార్యకు కొంత సాయం చేసినా, ముఖ్యమైన నిర్ణయాల్లో పురుషులదే పైచేయి. భార్య సంపాదన మీద నియంత్రణ కూడా పురుషులదే. స్త్రీలను పురుషులతో సమానంగా గుర్తించాలని, మానవ సంబంధాలలో మౌలికమైన మార్పులు రావాలని చెబుతూ...'లింగభేదం లేకుండా కుటుంబ సభ్యుల మధ్య ఇంటి పనిని సక్రమంగా పంచుకోవడంపై దృష్టి పెట్టండి' అంటారు అక్సోన్ కూల్.

భారత్‌లో ఉద్యోగాలు చేసే మహిళల సంఖ్య పెరుగుతోంది. అయితే, పని ప్రదేశంలో ఎంత ఒత్తిడికి గురవుతున్నా, ఇంటి పనిలో ఎలాంటి మినహాయింపు వుండదు. 'ఇంటెడు చాకిరి చేస్తూ/ పిల్లపాపలను కని పెంచుతూ/ ఉద్యోగము చేసి సంపాదిస్తూ/ జీతమంతా భర్త చేతిలో గుమ్మరించి/ బస్సు చార్జీలకై భర్త ముందు/ చేయి చాచి అర్థించిన నాడు-/ సిగ్గుతో ముడుచుకున్న చిరునవ్వును నేను' అంటారు డాక్టర్ వాసా ప్రభావతి. మహిళలు ఉద్యోగం చేయడానికి అంగీకరిస్తున్నప్పటికీ ఇంటి పనిభారం, పిల్లల సంరక్షణ బాధ్యతలను పంచుకోడానికి సగటు భారతీయ కుటుంబాల్లోని పురుషులు సిద్ధపడటంలేదు. ఉద్యోగులైన స్త్రీలు 5.8 గంటల సమయం ఇంటి పని చేయడానికి వెచ్చిస్తుండగా, నిరుద్యోగులైన పురుషులు 3.5 గంటలు, ఉద్యోగులైన పురుషులు 2.7 గంటలు మాత్రమే ఇంటి పని చేస్తున్నారని 'డేటా పాయింట్' ప్రచురించింది. దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ 15-59 సంవత్సరాల వయసు గల స్త్రీ పురుషుల్లో 85 శాతం కంటే ఎక్కువ మంది మహిళలు ఇంటి పనుల్లో నిమగ్నమై వుంటున్నారని లెక్కలు చెబుతున్నాయి. ఆడిటింగ్, ఐటీ, మీడియా వంటి రంగాల్లో వున్న మహిళలు వారానికి 55 గంటల కంటే ఎక్కువ సమయం పని చేస్తున్నారు. ఇది వారంలో ఆరు లేదా ఐదు రోజుల పనిని బట్టి ప్రతిరోజూ 9-11 గంటలు పని చేస్తున్నారని అంచనా. సగటు స్త్రీకి శ్రమ-జీవితం మధ్య సమన్వయం కుదరడం లేదు. 'సమస్యంతా అమ్మను అమ్మలా, మనిషిలా ఎలా చూడాలన్నదే/ నేను అమ్మనో బొమ్మనో కాకుండా/ మనిషిగా ఎలా నిలబడాలన్నదే!!' అంటారు. సమాజంలో శ్రామిక బానిసయ్యిందో, మనిషిగా ఎందుకు కాకుండా పోయిందోనని ఆవేదన వ్యక్తం చేస్తారు కవయిత్రి శోభారాణి.

ఒక సర్వే ప్రకారం...స్త్రీలలో 81.2 శాతం మంది వేతనంలేని గృహ సేవలలో నిమగ్నమై వున్నారు. గృహ నిర్వహణ, పిల్లలు, అనారోగ్యం, వృద్ధుల సంరక్షణ కోసం పురుషుల కంటే పదిరెట్లు ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తున్నారని ఆ సర్వే తేల్చింది. 'మహిళలందరూ పని చేస్తారు, కానీ వారందరికీ జీతం లేదు' అంటారు నోబెల్‌ప్రైజ్ గ్రహీత, ఆర్థికవేత్త క్లాడియా గోల్డిన్. శ్రమ, జీవితం...ఈ రెండిటి మధ్య సమతుల్యత సాధించడంలో మహిళలకు అనేక కష్టాలు ఎదురవుతున్నాయి. 'స్త్రీ, పురుషులలో వర్క్-లైఫ్ బ్యాలెన్స్ సాధించాలంటే ఇంటి పని విషయంలో పురుషుడు తప్పక సాయపడాలి. ప్రస్తుతం వర్క్ కల్చర్ మారిపోయిన నేపథ్యంలో ఇంటి నుంచి కూడా స్త్రీకి పూర్తి స్వేచ్ఛ లభించాలి' అని ఐఐఎం-అహ్మదాబాద్ ప్రొఫెసర్ సతీశ్ దియోధర్ నివేదిక వెల్లడించింది. స్త్రీల ఆరోగ్యం, వారి ప్రత్యేక పరిస్థితుల రీత్యా ఆయా సంస్థలు, ప్రభుత్వాలు కొన్ని నిబంధనలను సడలించాలి. ముఖ్యంగా కుటుంబం వారికి బాసటగా నిలవాలి. అప్పుడే సమతుల్యత సాకారమౌతుంది.

మహనీయుల మాట



మొత్తం ప్రజానీకాన్ని, శ్రమజీవులందరినీ ప్రభుత్వాధికారుల కబంధ హస్తాల నుండి, పెట్టుబడి పీడన నుండి విముక్తి చేయడానికి...శత్రువుపై పోరాడ్డం ఎలాగో కార్మికులు నేర్చుకునే పాఠశాల సమ్మె.

- వి.ఐ. లెనిన్

సనాతన మనుధర్మమా? సామాజిక సమధర్మమా?

ప్రస్తుతం





తెలకపల్లి రవి

> సతీ సహగమనం, కుల వివక్ష, అస్పృశ్యత, పితృస్వామ్య దురహంకారం, ఆధిపత్య కులాల దురహంకారం వంటి అసంఖ్యాక జాడ్యాలతో నిండిన సనాతన ఆచారాలను సంస్కరించడానికి సంస్కర్తలు, మహనీయులు ఎంతగానో పోరాడవలసి వచ్చింది. తన పిఠాపురం పక్కన రాజమండ్రిలోనే కందుకూరి వీరేశలింగం వితంతు పునర్వివాహం కోసం చేసిన కృషి ఆయనను ధృవతారగా నిల్పింది. కానీ చేగువేరా బొమ్మతో బయిలుదేరి సావర్కర్‌ను భుజానికెత్తుకున్న పవన్ పదేపదే సనాతన మంత్రం జపించడం ఈ సంస్కర్తల, విప్లవకారుల స్ఫూర్తికే కళంకం. దేశభక్తి అంటూ నిరంతరం మాట్లాడేవారు ఈ దేశమంటే మనుషులోయ్ అనీ, అన్నదమ్ముల వలెను జాతులు, మతములన్నియు మెలగవలెనోయ్ అనీ తెలుసుకోవాలి. వెనకచూసిన కార్యమేమోయ్ మంచి గతమున కొంచెమేనోయ్ అనీ ఆ గురజాడ ప్రబోధించిన పరమ సత్యం గ్రహిస్తే అప్పుడు సనాతనమంటూ ఇంకా ఇంకా వెనక్కు చూసే పరిస్థితి వుండదు. కాలం వెనక్కు నడవదు కూడా. వివక్షలకు మారు పేరైన సనాతన ధర్మం స్థానంలో సమ ధర్మం కోసమే సామాన్యులు పోరాడతారు. మనుధర్మం కన్నా మానవ ధర్మం మిన్న అని నినదిస్తారు.

పది రోజులుగా తిరుపతి లడ్డు చుట్టూ పరిభ్రమిస్తున్న వివాదాలు పాలక వర్గ పార్టీల రాజకీయాల తీరునూ, మోడీ హయాంలో ప్రబలిపోయిన మత రాజకీయాల లోతునూ బహిర్గతం చేశాయి. తిరుపతి కొండపై అనేక రకాల అక్రమాలనూ అందులో భాగంగా ఈ కల్తీ దుమారాన్ని కూలంకషంగా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసుకోవాలనడంలో సందేహం లేదు. కొండ మీద మంట అన్నట్టు ఇలాంటి మతలబులు ఇదే మొదటిసారి కాదు, చివరి సారీ కాకపోవచ్చు. దేశంలోని ఆలయాలన్నిటా ప్రసాదాల కల్తీ జరుగుతూనే వుందని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ స్వయంగా వారణాసి లోనే వాక్రుచ్చారు. యోగి ఆదిత్యనాథ్ ఏలుబడిలో ప్రస్తుతం ప్రయాగరాజ్‌గా మారిన త్రివేణీ సంగమంలో ఆలయాలలో కాశీ, మధుర అన్ని చోట్ల అదే పరిస్థితి దాపురించడం వెనక అంతర్జాతీయ కుట్ర దాగి వుందని అయోధ్య రామాలయ ప్రధాన పూజారి సత్యేంద్రనాథ్ దాస్ ప్రకటించారు. కాస్త వెనక్కు వెళితే తిరుపతి లడ్డూ కోసం కర్ణాటక పాల ఉత్పత్తిదార్ల సంఘం (కె.ఎం.ఎఫ్) నెయ్యి సరఫరా కాకపోవడం హిందూ వ్యతిరేక చర్య అని ఏడాది కిందటే బిజెపి ఆ ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై దాడి చేస్తే అది మీ హయాంలోనే జరిగిందని ఆయన ఎదురు వడ్డించారు. కనుక ఈ కథకు ముందూ వెనకా చాలా తతంగం వుంది. చాలా శక్తులూ వున్నాయి. అవి ప్రజలందరూ ఇష్టంగా తినే తియ్యనైన లడ్డూతో సంబంధం లేనివి. కాకపోతే ఈ వివాదం కూడా చినికి చినికి గాలివానగా అదే దారి పట్టడం వల్ల వాటిని ముచ్చటించాల్సి వచ్చింది. ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానమే దీనిపై మూడు పిటిషన్లను రేపు విచారించనుంది గనక పరిష్కారం ఏం చూపిస్తుందో వేచిచూడొచ్చు. ఈ లోగా ముఖ్యమంత్రి నియమించిన సిట్ దర్యాప్తు ప్రారంభించింది గనక అదేం తేలుస్తుందో, కోర్టు దానికి ఏమి చెబుతుందో కూడా చూడాలి. ఈ లోగా సంయమనం పాటించడం అందరి బాధ్యత.

పరివార్ భాషలో పవన్

కాకపోతే ఈ లోగా రాజ్యాంగ పదవిలో వున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆవేశ భాషణలు ఒక్కసారిగా అందరినీ ఆశ్చర్య పరచాయి. తెలుగునాట బాధ్యతాయుత పదవిలో వున్న ఒక బిజెపి యేతర నాయకుడి నోట అలాంటి మాటలు వినడం చాలా అరుదు. ఆఖరుకు బిజెపి నాయకులు కూడా ఈ విషయంలో అప్పటికి ఆ విధంగా మాట్లాడలేదు. లౌకికవాదంపై లౌకిక వాదులపై దాడి చేయడానికి పవన్ కళ్యాణ్ లడ్డూ వివాదం ఉపయోగించుకోవడం జనసేన అధ్యక్షుడి ఆంతర్యం ఏమిటన్న ప్రశ్న ప్రతి ఒక్కరిలో తొంగిచూసింది. ఈ సందర్భంగా ఆయన ప్రయోగించిన భాష సంఘ పరివార్ ఘనాపాటీలను మించిపోయిందంటే అతిశయోక్తి కాదు. హిందువుల మనోభావాలపై దాడి జరిగితే ఎవరికీ కనిపించదని ఆయన ఆక్రోశం వెలిబుచ్చారు. ఇదే మసీదులోనో చర్చిలోనో జరిగితే ఇలా వుంటారా అని ఇతర మతాల ప్రార్థనా స్థలాలను పోటీకి తెచ్చారు. ఇతర మతాలపై జరిగితే విమర్శలు కురిపించే లౌకిక వాదులు హిందువులపై జరిగితే పట్టించుకోరా అని ధ్వజమెత్తారు. ఇందులో ఏ ఒక్కదానికి ఆయన ఎలాంటి ఉదాహరణ గానీ, సందర్భం గానీ చూపించింది లేదు. ఎందుకంటే అన్ని రకాల మతోన్మాదాలను లౌకికవాదులు విమర్శిస్తూనే వున్నారు. తప్పులు జరిగితే మీ అధికారంతో చర్య తీసుకోండి గానీ మత భాషలో మాట్లాడటమెందుకని హితవు చెప్పిన సాటి నటుడు ప్రకాశ్ రాజ్‌పై పవన్ విరుచుకుపడ్డారు. 'లడ్డు వివాదంపై ఏమంటారు?' అని అడిగితే 'అది సున్నితమైన విషయం' అని దాటేసిన తమిళ నటుడు కార్తీకి హెచ్చరికలు జారీ చేసి సారీలు చెప్పించారు. తన కొత్త సినిమా ప్రమోషన్ కోసం ప్రయాస పడుతున్న కార్తీ సహజంగానే సారీ చెబుతూనే ఆ సందర్భం తెలియక మీరు ఆగ్రహించారని ముక్తాయించారు. ఇక మోడీ దాడినే లెక్క పెట్టని ప్రకాశ్ రాజ్ అసలు పవన్ విషయాలు తెలుసుకోకుండానే దాడి చేస్తున్నారని వరుస ట్వీట్లతో వెంటాడుతున్నారు. దీన్ని చక్కదిద్దుకోవడం కోసం పవన్ తర్వాత చాలా తంటాలు పడాల్సి వచ్చింది. ఢిల్లీలోని స్నేహితుల కోసం తాను ఇలా మాట్లాడుతున్నానని, ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యను తాను అర్థం చేసుకున్నానని కూడా సంజాయిషీ ఇచ్చుకోవలసి వచ్చింది. నిజంగానే ఎన్‌డిఎలో భాగస్వాములుగా నితీశ్ కుమార్ సీతామర్హిలో జానకి జన్మభూమి పిలుపునివ్వడం, చంద్రబాబు లడ్డూ వివాదం తేవడం జరిగాయని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఓ కథనం ప్రచురించింది. ఈ క్రమంలో పవన్ కళ్యాణ్ పోటీ ప్రభావం కూడా వుందని పేర్కొంది. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి గనక దాన్ని అడ్డుకోవడానికే ఈ వివాదం రగిలించినట్టు కనిపిస్తుందని 'హిందూ' సంపాదకీయంలో వ్యాఖ్యానించింది. అంతేగాక పక్కనే మైసూరులో ఎన్.డి.బి.బి పరిశోధనశాల వుండగా ఎప్పటిలాగా అక్కడికి పంపకుండా ఎక్కడో వున్న గుజరాత్‌కు ఎందుకు పంపాల్సి వచ్చిందని ప్రశ్నలు కూడా వచ్చాయి. ఘజియాబాద్‌కు ఎందుకు పంపలేదని 'హిందూ' కూడా ప్రశ్నించింది.

సగటు హిందువుగా ఏమిటి?

ఇవన్నీ ఒక ఎత్తు గానీ, తాను సగటు హిందువుగా మాట్లాడుతున్నానని ఉప ముఖ్యమంత్రి లౌకిక వాదంపై దాడి చేయడమే అన్నిటికన్నా తీవ్రమైన విషయం. మొదటిది తను సగటు హిందువు కాదు. ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ కథానాయకుడు కూడా. సగటు హిందువులు మామూలుగానే తిరుపతి సందర్శించుకుంటున్నారు. ఈ వివాదం రగిలిన మూడు రోజుల్లోనూ రోజుకు 3 లక్షలపైన లడ్డూలు ఎప్పటిలానే విక్రయమయ్యాయి. కనుక సగటు హిందువు పేరిట ఇతర మతాలను పోటీ పెట్టి మాట్లాడటం రాజ్యాంగ లౌకిక సూత్రాలకే విరుద్ధమైన విషయం. కుల, మత, లింగ తేడాలకు అతీతంగా విధి నిర్వహిస్తామని వీరంతా ప్రమాణం చేస్తారు. భారత రాజ్యాంగం కూడా అదే లౌకిక విలువలు బోధిస్తుంది. పీఠికలోనే లౌకిక, ప్రజాస్వామిక, సామ్యవాద, సార్వభౌమిక, గణతంత్ర రాజ్యంగా పేర్కొంటుంది. దీన్ని అత్యవసర పరిస్థితిలో ఇందిరా గాంధీ చేర్చారని బిజెపి వారు అంటుంటారు గాని అది రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి అనుగుణమైన చేర్పు మాత్రమే. ఆ మాట సుప్రీం కోర్టు తీర్పులోనే చెప్పింది. దాంతోపాటు అప్పుడే చేర్చిన ప్రజాస్వామిక సార్వభౌమిక అనే మాటలు తీసేస్తారా? లౌకిక తత్వం అనేది ఒకవైపునే వుండకూడదని, హిందువులకు కూడా వర్తించాలని పదేపదే అనడంలో పవన్ ఉద్దేశమేమిటి? అసలు లౌకిక తత్వమంటే రాజకీయాలకు మతానికి సంబంధం లేకుండా వుండటం. లోక సంబంధమైన విషయాలు తప్ప పార లౌకిక అంశాల జోలికి పోకూడదని అవి వ్యక్తిగతానికి వదిలేయాలని సారాంశం. దీన్ని మైనార్టీల పట్ల బుజ్జగింపుగా వక్రీకరించింది బిజెపి, ఆరెస్సెస్, సంఘ పరివార్. పవన్ మరో భాషలో అదే చెబుతున్నారన్నమాట. సచార్ కమిటీ నివేదికతో సహా అనేక అధ్యయనాలు చూస్తే ఆయన వాస్తవాలకు ఎంత దూరంగా వున్నారో తెలుస్తుంది. రకరకాల వివక్షలకు గురవుతున్న వారిలోనూ, అనేక విధాల వెనకబడిన వారిలోనూ మైనార్టీ ముస్లింలు ఎక్కువగా వున్నారు. పైగా భాషా సాంస్కృతిక మైనార్టీలకు ప్రత్యేక రక్షణ కల్పించింది రాజ్యాంగమే. మైనార్టీ అంటే ముస్లింలు అన్నది సామాన్య భావన తప్ప ఒకోచోట ఒకరు మైనార్టీగా వుండొచ్చు. దేశ సరిహద్దులు దాటితే మైనార్టీలై పోవచ్చు. భారత దేశం ముందునుంచి భిన్న మతాలతో కూడింది తప్ప ఏక మత దేశం కాదు. హిందూ మతం కూడా ఏకశిలా సదృశ్యమైంది కాదు. ఈ ప్రాథమిక వాస్తవాలు గుర్తించకుండా పవన్ కళ్యాణ్ వంటి వారు మతావేశానికి లోనై అందరిలోనూ అదే రగిలించాలని చూడటం దురదృష్టకరం. హిందూ మత భావనకు భిన్నంగా రాజకీయం దట్టించిన హిందుత్వను దామోదర సావర్కర్ కచ్చితంగా వందేళ్ల కిందట 1923లో ప్రతిపాదించారని ఆయన తెలుసుకోవాలి. తమలాంటి వారు మోడీకి జైకొట్టినా సగటు భారతీయులు దాన్ని ఆమోదించలేదు గనకే మూడోసారి కనీస మెజార్టీ కూడా రాలేదు. హిందుత్వను మరింతగా రగిలించాలనే ప్రయత్నంలోనే బుల్డోజర్ రాజ్యాలు, హక్కుల అణచివేత, కవులూ రచయితలు పాత్రికేయులపై దాడుల వంటివి జరుగుతున్నాయి. తను కూడా సినిమా నేపథ్యం నుంచి వచ్చినా అదే రంగానికి చెందినవారికి హెచ్చరికలు జారీ చేయడం మతపరమైన అసహనానికి నిదర్శనం. ఈ సమయంలోనే తమిళనాడు (బిజెపి) గవర్నర్ ఆర్.ఎన్.రవి లౌకికవాదం (సెక్యులరిజం) పాశ్చాత్య భావన తప్ప భారతీయం కాదని ప్రవచించడం యాదృచ్ఛికం కాదు. లౌకికతత్వం కోసం పోరాటం, ప్రజాస్వామ్య సమరం విడదీయరానివిగా వుంటాయి. తెలంగాణ ముస్లిం రాజ్యం, ఆంధ్ర ప్రదేశ్ క్రైస్తవ రాజ్యం అయిపోయాయని గతంలో బండి సంజయ్ ట్వీట్ చేస్తే దాన్ని రీట్వీట్ చేసిన వారు ఇప్పటికైనా కళ్లు తెరిస్తే మంచిది. బిజెపితో జత కట్టాక ఎలాంటి భావాలు ఆవరిస్తాయో, ఒత్తిళ్లు ఎలా పని చేస్తాయో అర్థం కావడానికి ఇదో ఉదాహరణగా వుంటుంది.


సనాతనమా, సమధర్మమా?

అలాగే సనాతన ధర్మం కోసం కంకణబద్ధులం కావాలని పవన్ కళ్యాణ్ పిఠాపురంలో ఎన్నికల ప్రచారం నాటి నుంచి చెబుతున్నారు. దాన్ని కాపాడటం కోసం జాతీయ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన తాజా పిలుపు! సతీ సహగమనం, కుల వివక్ష, అస్పృశ్యత, పితృస్వామ్య దురహంకారం, ఆధిపత్య కులాల దురహంకారం వంటి అసంఖ్యాక జాడ్యాలతో నిండిన సనాతన ఆచారాలను సంస్కరించడానికి సంస్కర్తలు, మహనీయులు ఎంతగానో పోరాడవలసి వచ్చింది. తన పిఠాపురం పక్కన రాజమండ్రిలోనే కందుకూరి వీరేశలింగం వితంతు పునర్వివాహం కోసం చేసిన కృషి ఆయనను ధృవతారగా నిల్పింది. కానీ చేగువేరా బొమ్మతో బయిలుదేరి సావర్కర్‌ను భుజానికెత్తుకున్న పవన్ పదేపదే సనాతన మంత్రం జపించడం ఈ సంస్కర్తల, విప్లవకారుల స్ఫూర్తికే కళంకం. దేశభక్తి అంటూ నిరంతరం మాట్లాడేవారు ఈ దేశమంటే మనుషులోయ్ అనీ, అన్నదమ్ముల వలెను జాతులు, మతములన్నియు మెలగవలెనోయ్ అనీ తెలుసుకోవాలి. వెనకచూసిన కార్యమేమోయ్ మంచి గతమున కొంచెమేనోయ్ అనీ ఆ గురజాడ ప్రబోధించిన పరమ సత్యం గ్రహిస్తే అప్పుడు సనాతనమంటూ ఇంకా ఇంకా వెనక్కు చూసే పరిస్థితి వుండదు. కాలం వెనక్కు నడవదు కూడా. వివక్షలకు మారు పేరైన సనాతన ధర్మం స్థానంలో సమ ధర్మం కోసమే సామాన్యులు పోరాడతారు. మనుధర్మం కన్నా మానవ ధర్మం మిన్న అని నినదిస్తారు. సరళీకరణ ప్రపంచీకరణలో సమిధలవుతున్న సామాన్యులను సమరాల నుంచి దూరం చేసేందు కోసం మత ప్రాతిపదికన విడదీసే ప్రయత్నాలు ఎవరు చేసినా ప్రజలు తిరస్కరిస్తారు.

★

కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత ఏదీ!

సమస్య



సిహెచ్.నరసింగరావు

> కేంద్ర బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వం యాజమాన్యాలకు సులభతర వ్యాపారాన్ని కల్పించడంలో పోటీ పడుతున్నాయి. కార్మికులకు అతి తక్కువ జీతాలు చెల్లించడం, పర్మినెంట్ చెయ్యకపోవడం ఇందులో ముఖ్యమైన విధానం. కార్మికులు పోరాటాలు చేస్తే అణచివేయటం కూడా ఈ విధానంలో భాగమే. ప్రభుత్వ విధానాల వల్ల పర్మినెంట్ కార్మికులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో పెరిగిన మాత్రం జీతాలు కూడా పెరగడంలేదు. అనేక అలవెన్స్‌లు రద్దు చేస్తున్నారు. ఉన్న హక్కులు తీసివేస్తున్నారు. పాలకులు పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు ఇద్దరిపైన దాడి చేస్తున్నారు. పర్మినెంట్ కార్మికులు గతంతో పోలిస్తే సంఖ్య రీత్యా బాగా తగ్గిపోతున్నారు. పర్మినెంట్ యూనియన్లు చొరవ తీసుకొని కాంట్రాక్ట్/ పర్మినెంటేతర కార్మికులను ఐక్యపరిచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి.



నేడు కాంట్రాక్టు/ పర్మినెంటేతర కార్మికులు అన్ని చోట్లకూ విస్తరించడం అత్యంత తీవ్రమైన సమస్య. మన రాష్ట్రంలో సత్య సాయి జిల్లాలోని 'కియా' కార్ల కంపెనీలోగాని, ప్రపంచంలోనే 103 రాకెట్లను ఒకేసారి ప్రయోగించిన అంతరిక్ష కేంద్రమైన సూళ్ళూరుపేట లోని 'ఇస్రో' పరిశోధనా కేంద్రంతో సహా అన్ని పరిశ్రమలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులన్నింటిలోను, అన్ని రకాల కేంద్ర స్కీమ్ కార్మికులు, విశాఖ స్టీల్ లాంటి భారీ, చిన్న పరిశ్రమలలోని, శాశ్వత పనులన్నింటిలోను కాంట్రాక్ట్ కార్మికులు వేగంగా పెరుగుతున్నారు. సైన్యంలో కూడా 4 సంవత్సరాలకే సర్వీసు పరిమితం చేశారు. రాష్ట్ర సంస్థలలో పెద్దవైన విద్యుత్, ఆర్‌టిసి లలో సగం మంది కాంట్రాక్ట్/పర్మినెంటేతర కార్మికులు పెరుగుతూ పర్మినెంట్ కార్మికులు తగ్గుతున్నారు. రిటైర్ అయిన పర్మినెంట్ కార్మికుల స్థానంలో కొత్తవారిని తీసుకోవడంలేదు. ఒకే పనిని పక్కనే ఉండి చేస్తున్నా కాంట్రాక్టు కార్మికులను చీప్ లేబర్‌గా వాడుకుంటున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పులు చెప్పినా ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయి. దేశంలోనే 12 లక్షల మంది కార్మికులు పని చేసే అతి పెద్ద రంగం రైల్వే. కాంట్రాక్టర్లు మారినప్పుడల్లా వర్క్ కాంట్రాక్ట్ పేరుతో ఎంతమంది పని చేయాలనే విషయంలో రైల్వే యాజమాన్యం కాంట్రాక్టర్లకు అడ్డూ ఆపు లేని అధికారాలిచ్చింది. దీన్ని అడ్డం పెట్టుకొని కాంట్రాక్ట్ కార్మికులను ఇష్టం వచ్చినట్లు తొలగిస్తున్నారు. ఈ కార్మికులకు పని గంటలు ఎక్కువ. కాని వీరి జీతాలు గొర్రె తోక బెత్తెడు లాగా ఎన్ని సంవత్సరాలు పని చేసినా పెరగవు. జీతాలు పెంచమని అడిగితే పాతవారిని పనిని నుంచి ఆపి, కొత్తవారిని తక్కువ జీతాలకు తెచ్చుకుంటున్నారు. కాంట్రాక్టర్లు వీరికి ప్రభుత్వ చట్టాలు అమలు చేయడంలేదు. సర్వసంపదలు సృష్టించే కార్మిక వర్గాన్ని అణిచివేసేందుకు పాలకులు కార్పొరేట్లతో కుమ్మక్కవుతున్నారు.

ఉదారవాద విధానాలు మన దేశంలో 1991 నుంచి అమలులోకి వచ్చాయి. అప్పటి వరకూ శాశ్వత స్వభావం కల్గిన పనులన్నింటిలోను పర్మినెంట్ కార్మికులే పనిచేసేవారు. ఎల్.పి.జి విధానాల పేరుతో శాశ్వతమైన పనులు, మెయిన్‌టినెన్స్, ఆపరేషన్, సెక్యూరిటీ, క్యాంటిన్లు ట్రాన్స్‌పోర్టుతో సహా పర్మినెంట్ పనుల్లో కాంట్రాక్ట్ కార్మికులు వచ్చారు. కార్మికులు పోరాడి కాంట్రాక్ట్ లేబర్ (రెగ్యులేషన్ మరియు ఎబాలిషన్) చట్టం-1970ని సాధించుకున్నారు. యూనియన్లు పోరాటాల వల్లే ఈ చట్టం లోని ప్రతి అంశాన్ని అమలు చేయించుకోవడం సాధ్యమైంది. జ్యోతిబసు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఈ చట్టాన్ని ఉపయోగించే పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్ స్టీల్‌ప్లాంట్, ఇస్కో స్టీల్ ప్లాంట్లలో కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేశారు. ఆ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని చట్టంలో లేకున్నా రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసి వేలాది మంది కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయించారు. ఆ స్ఫూర్తితోనే విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 1991లో 1700 మంది క్యాజువల్ కార్మికుల కోసం పోరాడి సిఐటియు నాయకత్వంలో పర్మినెంట్ చేయించాం. కాంట్రాక్టు లేబరు చట్టంలోని గుర్తింపు కార్డు, పే స్లిప్, 20 రోజులకు ఒక ఎర్న్‌డ్ లీవ్, తొలగించినప్పుడు సెక్షన్ 25 ఎఫ్ఎఫ్ ప్రకారం రిట్రెంచ్‌మెంట్ నష్టపరిహారం ప్రతి సంవత్సరానికి 15 రోజుల జీతం చొప్పున కాంట్రాక్టు కార్మికులు సాధించుకున్నారు. అంతేగాకుండా గ్రాట్యూటీ చట్టం ప్రకారం 5 సంవత్సరాలు దాటిన వారందరికీ సంవత్సరానికి 15 రోజుల జీతం, బోనస్ చట్టం ప్రకారం బోనస్ తప్పక చెల్లించేవారు. చట్టాలను అమలు చెయ్యకపోతే కార్మికశాఖ ద్వారా అమలు చేయించుకునేవారు. కార్మిక శాఖ నేడు పూర్తిగా చచ్చుబడి పోయింది. నేటికీ అవే చట్టాలున్నా కార్మిక శాఖ నిర్వీర్యం అయింది. ఏ ఒక్క చట్టాన్ని అమలు చేయడంలేదు. యూనియన్ పెట్టుకోవడానికి కార్మిక శాఖకు దరఖాస్తు చేయగానే 7 పేర్లు ఆ కంపెనీ యాజమాన్యానికి వెళ్తున్నాయి. కాంట్రాక్టరు వెంటనే వారిని పని నుంచి తొలగిస్తున్నారు. మిగిలిన కార్మికులు భయపడి యూనియన్లో లేకుండా బానిసల్లాగా పని చేస్తున్నారు. తొలగించిన కార్మికుల వివాదాల్లో కార్మికశాఖ జోక్యం లేదు. కాంట్రాక్టు/పర్మినెంటేతర కార్మికులకు ఉద్యోగ భద్రత కీలకం. ఉన్న ఉద్యోగం పోతుందని కాంట్రాక్టు కార్మికులు భయభ్రాంతులతో పనిచేస్తున్నారు. దీనిని అవకాశంగా తీసుకొని కాంట్రాక్ట్ వర్కర్లకు వర్తించే పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ, బోనస్‌లతో సహా ఏ చట్టాలూ అమలు చేయకుండా కార్మికులకు పంగనామాలు పెడుతున్నారు. ప్రభుత్వాలు పరిశ్రమల్లో తనిఖీలు లేకుండా చేసేశాయి. పరిశ్రమల్లో ప్రాణాలకు కూడా భద్రత లేకుండా పోయింది.

సెప్టెంబర్ 30న దేశ వ్యాప్తంగా 'డిమాండ్స్ డే'

నేటి కాంట్రాక్ట్ కార్మికుల దుస్థితికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలే. పాలకులు కార్పొరేట్ అనుకూల విధానాలు పాటిస్తున్నారు. కార్మికులను పర్మినెంట్ చేస్తే పని చేయరని ప్రచారం చేస్తున్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వం యాజమాన్యాలకు సులభతర వ్యాపారాన్ని కల్పించడంలో పోటీ పడుతున్నాయి. కార్మికులకు అతి తక్కువ జీతాలు చెల్లించడం, పర్మినెంట్ చెయ్యకపోవడం ఇందులో ముఖ్యమైన విధానం. కార్మికులు పోరాటాలు చేస్తే అణచివేయటం కూడా ఈ విధానంలో భాగమే. ప్రభుత్వ విధానాల వల్ల పర్మినెంట్ కార్మికులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో పెరిగిన మాత్రం జీతాలు కూడా పెరగడంలేదు. అనేక అలవెన్స్‌లు రద్దు చేస్తున్నారు. ఉన్న హక్కులు తీసివేస్తున్నారు. పాలకులు పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు ఇద్దరిపైన దాడి చేస్తున్నారు. పర్మినెంట్ కార్మికులు గతంతో పోలిస్తే సంఖ్య రీత్యా బాగా తగ్గిపోతున్నారు. పర్మినెంట్ యూనియన్లు చొరవ తీసుకొని కాంట్రాక్ట్/ పర్మినెంటేతర కార్మికులను ఐక్యపరిచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి. విశాఖ స్టీల్‌లో గత 30 సంవత్సరాల నుంచి పర్మినెంట్ యూనియన్ సహాయంతో కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ విజయవంతంగా నడుస్తున్నది. దేశంలోని అన్ని స్టీల్‌ప్లాంట్ల కంటే హెచ్చు జీతాలు సాధించారు. కాంట్రాక్టర్ మారినా కార్మికులను తొలగించకుండా పని భద్రత అమలులో వుంది. కానీ నేడు కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుంది. దీనికి వ్యతిరేకంగా భారీ పోరాటాలు సాగుతున్నాయి. మోడీ "నో పర్మినెంట్" విధానాలను ఓడించడానికి యావత్తు కార్మికులను ఐక్యం చేయడం ఒక్కటే మార్గం. ఈ కింది డిమాండ్లను సాధించుకోవడానికి దేశవ్యాప్తంగా బలమైన ఉద్యమం నడిచినప్పుడే కేంద్ర ప్రభుత్వం మెడలు వంచడం సాధ్యం.

1.శాశ్వత స్వభావం కలిగిన పనుల్లో పనిచేసే ట్రాన్స్‌పోర్టు, క్యాంటిన్, సెక్యూరిటీ, మెయిన్‌టెనెన్స్, ఆపరేషన్లలో పని చేసే కార్మికులందరూ పర్మినెంటే. వీరందరినీ చట్టప్రకారం పర్మినెంట్ చేయాలి. 2. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలి. 3. కాంట్రాక్టర్ మారినా కార్మికులను కొనసాగించాలి. 4. చట్ట ప్రకారం ఇఎస్ఐ, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యూటీ, బోనస్ లాంటి చట్టాలన్నింటిని అమలు చేయాలి.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /

జనవాక్యం

పరీక్షల ప్రక్షాళన అవసరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మూడు రకాల పద్ధతుల్లో పరీక్షలు నిర్వహిస్తుంది. కొన్ని పరీక్షలను సి.బి.ఎ పద్ధతిలో, మరికొన్ని పరీక్షలను వాట్సాప్ ద్వారా పంపిన పేపర్ల ద్వారా, ఇంకొన్ని పరీక్షలను ముద్రించిన పేపర్లను పంపిణీ చేసి నిర్వహిస్తుంది. సి.బి.ఎ పద్ధతిలో నిర్వహించే పరీక్షలకు ఓ. ఎం.అర్ షీట్ కూడా ఉంటుంది. ఇందులో అడిగే ప్రశ్నలు చాలా కఠినంగా ఉంటున్నాయి. పాఠ్య పుస్తకాలలో అంశాలు పెద్దగా ఇందులో రావడం లేదు. వాట్సాప్ ద్వారా పంపే పేపర్లు చాలా సులభంగా ఉంటున్నాయి. అయితే పేపర్స్‌ను జిరాక్స్ తీయించి పరీక్ష నిర్వహించాలంటే ఉపాధ్యాయ సిబ్బందికి ఇబ్బందిగా ఉంటుంది. ఇందుకు అయ్యే ఖర్చులను వారే భరిస్తున్నారు. సమ్మేటివ్ పరీక్షా పత్రాలను మాత్రం డి.సి.బి. ఈ పంపిణీ చేస్తుంది. ఒకే ఏడాది మూడు రకాల పద్ధతులలో పరీక్షలను నిర్వహించడం వల్ల విద్యార్థులకు పరీక్షా విధానంపై సరిగ్గా అవగాహన ఏర్పడటం లేదు. పరీక్షల విధానంలో మార్పులు అవసరమని విద్యా రంగ నిపుణులు అంటున్నారు. విద్యార్థులకు సిలబస్‌పై అవగాహన రావాలంటే ఒకే రకమైన పరీక్షా విధానం ఉండాలి. ప్రభుత్వమే అన్ని పరీక్షా పత్రాలను పంపిణీ చేయాలి.

- యం. రాం ప్రదీప్, తిరువూరు.

నవంబరు 26లోగా మహారాష్ట్ర ఎన్నికలు : సిఇసి రాజీవ్ కుమార్

ముంబయి : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నవంబరు 26లోగా నిర్వహించాల్సి వుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. ముంబయిలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దీపావళి పండగను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల తేదీలు ప్రకటించాలని రాజకీయ పార్టీలన్నీ కోరుతున్నాయన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సన్నాహాలను ఆయన సమీక్షించారు. ఎన్నికల సందర్భంగా అధికారులందరూ డిప్యుటేషన్‌పై ఎన్నికల కమిషన్ పరిధిలో వుంటారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాంట్రాక్ట్‌పై తీసుకున్న పదవీ విరమణానంతరం పొడిగించిన ఏ నిర్ణయమైనా ఏ కేసుకు ఆ కేసును బట్టి మారుతుందని చెప్పారు. ఎన్నికలను ప్రభావితం చేయగలిగే పరిస్థితిలో వున్నారని తెలితే మాత్రం కచ్చితంగా వారిపై చర్యలు వుంటాయన్నారు. ఒకే పోస్టింగ్‌లో మూడేళ్లు దాటిన వారందరినీ వెంటనే బదిలీ చేయాల్సిందిగా మహారాష్ట్ర ప్రభుత్వాన్ని సిఇసి కోరారు.

ఐరాసలో పాక్‌పై ధ్వజమెత్తిన భారత్

ఐక్యరాజ్య సమితి : ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ వేదికగా పాకిస్తాన్ శుక్రవారం జమ్మూ కాశ్మీర్ అంశాన్ని లేవనెత్తడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. సీమాంతర తీవ్రవాదాన్ని ఆయుధంగా మార్చుకున్న పొరుగు దేశాలపై దాడి చేసే ఆ దేశం ఈనాడు హింస గురించి, భారత్ గురించి మాట్లాడటం విడ్డూరంగా వుందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా సంభవించిన తీవ్రవాద దాడుల్లో పాక్ జాడలు, మూలాలు వున్నాయని భారత్ పేర్కొంది. భారత్‌కు వ్యతిరేకంగా సీమాంతర తీవ్రవాదానికి పాల్పడితే వివిధ పర్యవసానాలు తప్పవని ఆ దేశం గుర్తించాలని స్పష్టం చేసింది. పాకిస్తాన్ శుక్రవారం చేసిన ప్రసంగంలోని కొన్ని అంశాలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఇందుకు గాను రైట్ టు రిప్లై ను ఉపయోగించుకుంది.

శుక్రవారం పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ, జమ్ము కాశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. 370వ అధికరణ రద్దును భారత్ వెనక్కి తీసుకోవాలన్నారు. కాశ్మీర్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి చర్చలు జరపాలని కోరారు.

ఐరాసలో మాట్లాడుతున్న భారత్ ప్రతినిధి భవిక

పాక్ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ భారత్ ప్రతినిధి భవికా మంగళానందన్ మాట్లాడారు. 'ఈ జనరల్ అసెంబ్లీ నేటి ఉదయం ఒక అపహాస్యానికి వేదికగా నిలిచింది. సైన్యం మద్దతుతో పాలన సాగించే ఈ దేశం, తీవ్రవాదానికి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నేరాలకు అంతర్జాతీయంగా గుర్తింపును తీసుకువచ్చిన ఈ దేశం... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌పై దాడికి దిగడం విడ్డూరంగా వుంది.' అని భారత్ దౌత్యవేత్త భవిక పేర్కొన్నారు. పాకిస్తాన్ సీమాంతర తీవ్రవాదాన్ని పొరుగుదేశాలపై ఒక ఆయుధంగా ఉపయోగిస్తుందని యావత్ ప్రపంచానికి తెలుసునని అన్నారు. మన పార్లమెంట్‌పై, ఆర్థిక రాజధాని ముంబయిపై, మార్కెట్ స్థలాలు, యాత్రా మార్గాలపై దాడికి పాల్పడిందని ఆమె విమర్శించారు. ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా చాంతాడంత వుంటుందన్నారు. అటువంటి దేశం ఎక్కడైనా హింస గురించి మాట్లాడటమనేది ఆత్మ వంచన తప్ప మరొకటి కాదని భవిక పేర్కొన్నారు. 'మరిన్ని అబద్ధాలు, అసత్యాలతో వాస్తవాలపై దాడి చేయాలని పాకిస్తాన్ ప్రయత్నిస్తోంది. పదే పదే చెప్పడం వల్ల మార్పేమీ వుండదు. భారత్ వైఖరి చాలా స్పష్టంగా వుందని, ప్రతీసారీ పునరుద్ఘాటించాల్సిన అవసరం లేదని' భారత్ తేల్చి చెప్పింది. రిగ్గింగ్ ఎన్నికల చరిత్ర కలిగిన ఆ దేశం రాజకీయ ఎంపికల గురించి అది కూడా ప్రజాస్వామ్య దేశం గురించి మాట్లాడడం చాలా వింతగా వుందన్నారు.

రెండోరోజూ వర్షార్పణం

- ఒక్క బంతి పడకుండానే నిలిచిన ఆట
- బంగ్లాదేశ్ 107/3

కాన్పూర్: భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య కాన్పూర్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టు రెండో రోజు ఆట కూడా వర్షం కారణంగా రద్దయ్యింది. ఉదయం నుంచి వర్షం పడటంతో ఆటగాళ్లు మైదానంలో దిగేందుకు వీలుపడలేదు. వర్షం కారణంగా మైదానమంతా చిత్తడిగా మారింది. దీంతో రెండో రోజు ఆటను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు టీ విరామం తర్వాత ప్రకటించారు. తొలి రోజు కేవలం 35ఓవర్ల ఆట మాత్రమే కొనసాగగా... వర్షం కారణంగా సగానికిపైగా ఓవర్లు తుడిచిపెట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆ సమయానికి బంగ్లాదేశ్ జట్టు 3వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. క్రీజులో మొమినల్ హక్(40), ముష్ఫికర్ రహీమ్(6) ఉన్నారు. రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 1-0 ఆధిక్యతలో ఉన్న సంగతి తెలిసిందే.

8 పార్లమెంటరీ కమిటీల్లో సిపిఎం ఎంపీలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎనిమిది పార్లమెంటరీ కమిటీల్లో సిపిఎం ఎంపీలు నియమితులయ్యారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ జాబితాను విడుదల చేశారు. పార్లమెంటరీ కామర్స్ కమిటీ సభ్యులుగా అమ్రారామ్, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, లా, జస్టిస్ కమిటీ సభ్యులుగా రాధాకృష్ణన్, గ్రామీణాభివద్ధి, పంచాయతీ రాజ్ కమిటీ సభ్యులుగా కె.రాధాకృష్ణన్, బొగ్గు, గనులు, ఉక్కు కమిటీ సభ్యులుగా ఎస్.వెంకటేశన్, రసాయనాలు, ఎరువులు కమిటీ సభ్యులుగా ఆర్.సచ్చిదానందం, ఎన్నికలు, మహిళా, చిల్డ్రన్స్, యువత, క్రీడల కమిటీ సభ్యులుగా బికాష్ రంజన్ భట్టాచార్య, విదేశీ వ్యవహారాల కమిటీ సభ్యులుగా జాన్ బ్రిట్టాస్, ఎఎ రహీమ్, పెట్రోలియం, సహజ గ్యాస్ కమిటీ సభ్యులుగా వి. శివదాసన్ నియమితులయ్యారు.

మరో రూ.3 వేల కోట్ల రుణానికి ఇండెంట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం రూ.3,000 కోట్ల అప్పుకు సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. అక్టోబర్ 1న వేలం వేస్తారు. దీంతో మూడున్నర నెలల్లో ఏడుసార్లు మొత్తం రూ.20 వేల కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇండెంట్ పెట్టినట్లు అయింది. ఇప్పటివరకు ఆరుసార్లు 17,000 కోట్ల అప్పుకు సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (ఈ-కుబేర్) వేలం వేయనుంది. కాంపిటీటివ్, నాన్ కాంపిటీటివ్ బిడ్స్ రూపంలో ఆర్‌బిఐ వాటిని విక్రయిస్తుంది. తాజాగా అక్టోబర్ 1న నిర్వహించనున్న స్టేట్ గవర్నమెంట్ సెక్యూరిటీస్ వేలంలో రూ. 3,000 కోట్ల (ఒక్కొక్కటి రూ.1,000 కోట్లు చొప్పున మూడు బాండ్లు) అప్పుకు రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో రూ.1,000 కోట్ల విలువ చేసే మూడు సెక్యూరిటీ బాండ్లను ఏపి ప్రభుత్వం వేలానికి పెట్టింది. మొదటి రూ.1,000 కోట్ల బాండు 14 ఏళ్లు, రెండో రూ.1,000 కోట్ల బాండు 20 ఏళ్లు, మూడో రూ.1,000 కోట్ల బాండు 24 ఏళ్ల కాల పరిమితి ఉంటుంది. ఈ సెక్యూరిటీ బాండ్లను వ్యక్తులు, సంస్థలు కొనుగోలు చేయొచ్చని ఆర్‌బిఐ తెలిపింది. కాంపిటీటివ్ విధానంలో బాండ్లను కొనదలిచిన వారు అక్టోబర్ 1న ఉదయం 10:30 గంటల నుంచి 11:30 గంటల మధ్య కాంపిటేటివ్ (పోటీ) బిడ్స్‌ను దాఖలు చేయాల్సి ఉంటుందని, అలాగే ఉదయం 10:30 గంటల నుంచి ఉదయం 11 గంటల మధ్య నాన్ కాంపిటేటివ్ (పోటీ లేని) బిడ్స్‌ను దాఖలు చేయాల్సి ఉంటుందని ఆర్‌బిఐ తెలిపింది.

జపాన్ పాలక పార్టీ నేతగా ఇషిబా

- 1న కొత్త ప్రధానిగా ప్రకటన

టోక్యో : మాజీ రక్షణ మంత్రి షిగెరు ఇషిబా జపాన్ కొత్త ప్రధాని కానున్నారు. శుక్రవారం జరిగిన పాలక లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో ఆర్థిక మంత్రి సానా తకైచిపై గెలుపొందారు. ఈ నేపథ్యంలో ఆయన అక్టోబర్ 1న ప్రధాని పదవిని చేపట్టనున్నారు. ఎల్‌డిపి ఎంపీలు, సభ్యులు వేసిన 409 ఓట్లలో ఇషిబాకు 215 వచ్చాయి. తకైచికి 194 లభించాయి. రక్షణ, వ్యవసాయం, ప్రాంతీయ పునరుజ్జీవనం వంటి రంగాలకు సంబంధించి విధానాల రూపకల్పనలో ఆయనకు నైపుణ్యం వుంది. వచ్చే మంగళవారం ఇషిబాను పార్లమెంట్‌లో ప్రధానిగా ప్రకటిస్తారు. ఫ్యుమియో కిషిదా స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు.

(మొదటి పేజీ తరువాయి)

ఇండియా ఫోరం రూపశిల్పి

చాటిచెప్పాయి. జననాట్య మంచ్, ప్రచమ్ కళాకారులు విప్లవగీతాలు ఆలపించారు.

'మెరుగైన భారత్... సామ్యవాద భారత్' ఏచూరి ఆలోచన : ప్రకాశ్ కరత్

సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ మాట్లాడుతూ సీతారాం ఏచూరితో తనకున్న అనుబంధం 50 ఏళ్ల నాటిదని గుర్తు చేసుకున్నారు. వామపక్ష ఉద్యమానికి ఆయన చేసిన కృషిని, ముఖ్యంగా హిందుత్వ రాజకీయాలపై ఆయన చేసిన పోరాటాన్ని వివరించారు. మెరుగైన భారతదేశం.. సామ్యవాద భారతదేశం ఏచూరి ఆలోచన అని, ఈ ఆలోచనను నెరవేర్చడానికి మనమందరం కలిసి పని చేయాలని, అదే ఏచూరికి ఇచ్చిన నిజమైన, ఘనమైన నివాళి అవుతుందని అన్నారు. లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఏకతాటిపైకి తీసుకురావడంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు.

ఇండియా బ్లాక్ చీఫ్ ఆర్కిటెక్ట్ : రాహుల్

ఇండియా బ్లాక్ చీఫ్ ఆర్కిటెక్ట్ ఏచూరి అని, ఆయన వివిధ పార్టీల మధ్య వారధి అని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. "సీతారాం ఏచూరి నా స్నేహితుడు. ఆయన స్నేహితునిగా ఉన్నందుకు చాలా గర్వపడుతున్నాను. పరిచయమైన మొదటి రోజు నుండి ఆయన్ని చాలా దగ్గరగా చూశాను. ఇతరుల మాటలు విని వారి మాటలకు విలువనిచ్చే వ్యక్తి. ఆయన తన సొంత భావజాలంలో స్థిరంగా ఉన్నప్పటికీ, ఎదురుగా ఉన్నవారి ఆలోచనలు, వైఖరులు, భావాలను అర్థం చేసుకున్నారు. మేము ఏచూరితో మాట్లాడినప్పుడు, ఆయన ఎక్కడ నుండి వస్తున్నాడో, మేము ఎక్కడ నుండి వస్తున్నామో మాకు స్పష్టమైన అవగాహన ఉంటుంది. రాజకీయ నాయకుల్లో ఉండే దర్పం, అహంకారం, ఆగ్రహం వంటివి మచ్చుకు కూడా కానరాని మహా నేత ఏచూరి అని అన్నారు. కనిపించలేదు. ఒక వ్యక్తి ఉత్తమ లక్షణాలను రాజకీయాలు అరువు తెచ్చుకుంటాయనడానికి ఆయన ఒక ఉదాహరణ" అని అన్నారు. "ఇండియా బ్లాక్‌కు ప్రధాన రూపశిల్పిగా ఉన్న ఏచూరి వివిధ పార్టీల మధ్య వారధిగా నిలిచారని అన్నారు. మా తల్లి (సోనియా) కూడా ఏచూరికి గొప్ప స్నేహితురాలు. నిజానికి మా అమ్మ నాకంటే ఆయనతో ఎక్కువ స్నేహం చేసేది. కొద్దిరోజుల క్రితం అమ్మను చూసేందుకు ఏచూరి వచ్చారు. రాజకీయాల గురించి చర్చిస్తున్నప్పుడు, ఆయన విపరీతంగా దగ్గడం గమనించాను. అప్పుడు నేను, 'ఏచూరీజీ మీరు వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి' అన్నాను. ఆయన నవ్వి ఊరుకున్నారు. మా అమ్మలాగే ఆయన కూడా ఆసుపత్రికి వెళ్లడానికి ఇష్టపడలేదు. ఆయన తిరిగి వెళ్లిపోతున్నప్పుడు కూడా నేను మళ్లీ మెసేజ్ చేశాను.. 'కారు నేరుగా ఆసుపత్రికి వెళ్లనివ్వండి'. ఆయన ఇంకా సంకోచించాడు. తరువాత ఆసుపత్రికి వెళ్లేందుకు అంగీకరించారు. నా స్నేహితుడు త్వరలో ఆసుపత్రి నుండి వస్తాడని ఆశించాను. నా ఆశ ఫలించలేదు. కొడుకు చనిపోయిన సందర్భంగా ఫోన్ చేశాను. ఆయన ఫోన్ ఎత్తేసరికి నేనేం మాట్లాడలేకపోయాను. తరువాత, ఏచూరి నిష్క్రమణ తరువాత నేను ఆయన కుటుంబానికి సంతాప సందేశం రాయడానికి ప్రయత్నించినప్పుడు. నేను మాటల కోసం వెతికాను. డ్రాఫ్ట్‌లు మార్చాను. తిరిగి రాశాను. అలా చివరకు ఒక సందేశం ఎలాగో రాశాను. ఏచూరీజీ మనం ఎప్పుడూ విశ్వసించగలిగే వ్యక్తి. ఎలాంటి ఒత్తిడికి లొంగలేదు. ఆయన చేసినదంతా భారతదేశ మేలు కోసమే" అని అన్నారు.

యువతకు, విద్యార్థులకు ఏచూరి గొప్ప స్ఫూర్తిదాయకం : పినరయి విజయన్

సీతారాం ఏచూరి "భారతీయ చరిత్ర, సమాజం, సంస్కృతి, రాజకీయాలపై మంచి అవగాహన ఉన్న మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త" అని కేరళ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు పినరయి విజయన్ పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్యానికి, లౌకికవాదానికి అత్యంత అవసరమైన తరుణంలో ఏచూరిని మనం కోల్పోయామని అన్నారు. సెక్యులరిజంపై మతోన్మాదం పెద్దఎత్తున దాడులు చేస్తున్న తరుణంలో ఏచూరి నిష్క్రమణ ఒక దెబ్బ అని, సిపిఎం ప్రధాన కార్యదర్శిగా కష్టకాలంలో పార్టీని నడిపించారని అన్నారు. దేశ చరిత్ర, సంస్కృతి, సామాజిక వాస్తవాలు, ప్రస్తుత సంఘటనల గురించి ఆయనకు లోతైన అవగాహన ఉందన్నారు. అదే సమయంలో, అంతర్జాతీయ పరిణామాలను నిశితంగా పరిశీలించి విశ్లేషించేవారని అన్నారు. మార్క్సిజాన్ని, లెనినిజాన్ని, చారిత్రక భౌతికవాదాన్ని సామాన్యులకు కూడా అర్థమయ్యేలా చాలా సరళమైన భాషలో అందించగలిగారని అన్నారు. ఆయన నేతృత్వంలో పార్టీ తరగతులు గొప్ప ప్రభావాన్ని చూపాయన్నారు. దేశంలోని యువతకు, విద్యార్థులకు ఏచూరి ఎప్పుడూ గొప్ప స్ఫూర్తిదాయకంగా ఉండేవారని అన్నారు. ఏచూరి మరణానంతరం జెఎన్‌యు ఇచ్చిన ఉద్వేగభరితమైన సందేశం దేశంలోని విద్యార్థులకు ఆయనపై ఉన్న అపారమైన అభిమానానికి నిదర్శనమని అన్నారు. పార్లమెంటులో ఏచూరి కార్యకలాపాలన్నీ ప్రజల సంక్షేమానికి సంబంధించినవేనని, ఆయన 'పీపుల్స్ పార్లమెంటేరియన్' అనే బిరుదుకు అర్హుడని అన్నారు. ఆర్టికల్ 370, సిఎఎ, ఎలక్టోరల్ బాండ్ వంటి సమస్యలపై నికరంగా పోరాడారని అన్నారు. గత ఎనిమిదేళ్లుగా ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి ఆయన మార్గదర్శకాలు ఎంతగానో తోడ్పడ్డాయని, కేరళ ఆర్థిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కబళించడాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీలో పెద్దఎత్తున ఆందోళన నిర్వహించినప్పుడు వివిధ జాతీయ పార్టీల నేతలను అందులో భాగస్వామ్యం చేయడంలో ఆయన కృషి వుందని అన్నారు. ఏచూరి మరణం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని అన్నారు.

ఏచూరి అందరి సొత్తు : మల్లికార్జున్‌ఖర్గే

సీతారాం ఏచూరి కమ్యూనిస్టు పార్టీకి మాత్రమే ఆస్తి కాదని, అందరి అభిమాన నాయకుడని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. తమ అందరితో సమావేశాలు పెట్టేవారని, ఆయన ఇండియన్ బ్లాక్ ప్రధాన రూపశిల్పి అని, ఇండియా బ్లాక్‌లో ఐక్యతను తీసుకురావడానికి, దానిని ముందుకు తీసుకెళ్లడానికి ఏచూరి కృషి చేశారని గుర్తు చేశారు. అందరూ అంగీకరించే విధానాన్ని రూపొందించారని అన్నారు. ఏచూరి తన జీవితాంతం ప్రజల కోసమే ఉన్నారని, మొదటి యుపిఎ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ చట్టంపై ఆయన ఎంతో ఆసక్తి కనబరిచారని తెలిపారు. పేదల అభ్యున్నతికి ఉపాధి హామీయే గొప్ప చట్టం అని గట్టిగా వాదించారన్నారు. ఏచూరిని కోపంగా చూడలేదని, అసహనం ఆయన పదజాలంలో లేదని అన్నారు. చర్చలు జరిగితే, 'జరిగిందేదో జరిగింది. ఇప్పుడు మనం ఏమి చేయగలమో చూద్దామని అనేవారని' తెలిపారు. అలాంటి వ్యక్తి మధ్యవర్తిత్వం వహించకపోతే మా పోరాటాలు కొనసాగేవి కావని అన్నారు. దేశ ప్రజల ఉమ్మడి శ్రేయస్సు కోసం మనమందరం కలిసివచ్చే వేదికను మనం సృష్టించగలమని ఆయన ఎల్లప్పుడూ గుర్తుచేస్తారని అన్నారు. ఖర్గేజీ కూడా మా సహచరుడు, ఆయనే మాతో పాటు నిలబడతారని చెప్పేవారని గుర్తు చేసుకున్నారు.

ప్రపంచంలోని ఏ అగ్రశ్రేణి సంస్థకైనా చేరుకోగలిగే విద్యార్థి ఏచూరి : ప్రభాత్ పట్నాయక్

ప్రఖ్యాత ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ మాట్లాడుతూ సీతారాం ఏచూరిని కేవలం సహచరుడు, స్నేహితుడిగా మాత్రమే కాకుండా, "తెలివైన" విద్యార్థిగా కూడా గుర్తు చేసుకున్నారు. సీతారాం తన అత్యుత్తమ విద్యార్థి అని, స్కాలర్‌షిప్‌తో ప్రపంచంలోని ఏ ప్రముఖ విద్యాసంస్థలోనైనా చదువుకోవచ్చునని, జెఎన్‌యులో కొనసాగాలనే ఆయన నిర్ణయం సంస్థను తీర్చిదిద్దడంలో పాత్ర పోషించిందని ఆయన అన్నారు. 1973లో జెఎన్‌యులో ఎంఎ కోర్సు చదివేందుకు వచ్చిన సీతారాం, పరిశోధనలో తలమునకలై పార్టీలో చేరారని అన్నారు. కమ్యూనిస్టు విప్లవానికి కావాల్సిన విధానాలు, వ్యూహాలను కచ్చితంగా తెలుసుకుని వాటిని ఆచరణలో పెట్టాలనే ఆలోచన సీతారామ్‌కు ఉందని అన్నారు. ఆయనను "ఆధునిక కమ్యూనిస్ట్" అని అన్నారు.

మహోన్నతమైన కమ్యూనిస్టు నాయకుల్లో ఒకరు : డి.రాజా

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా మాట్లాడుతూ దేశ సమకాలీన చరిత్రలో మహోన్నతమైన కమ్యూనిస్టు నాయకుల్లో సీతారాం ఏచూరి ఒకరని అన్నారు. సీతారాం మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, యావత్ దేశానికి తీరని లోటని, ఆయన వారసత్వం ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. సమానత్వంతో కూడిన సోషలిస్టు భారతదేశం వైపు దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు, నవ భారత నిర్మాణానికి వామపక్షాలు ఈ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.

ఎపి జెఎసి సెక్రటరీ జనరల్‌గా కెఎస్ఎస్ ప్రసాద్

(మొదటి పేజీ తరువాయి)

పంచాయితీరాజ్ శాఖలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 3వేల కారుణ్య నియామకాలు వెంటనే జరపాలని, గత ప్రభుత్వంలో నిర్వహించిన సమయంలో పెట్టిన కేసులన్నింటినీ ఎత్తివేయాలని సమావేశం కోరింది. ఎపి వైద్యవిధాన పరిషత్‌లో 10 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను మంజూరు చేయాలని, పెన్షనర్లకు అదనపు క్వాంటం పెన్షన్ మంజూరు చేయాలని, సచివాలయ ఉద్యోగులకు స్టిక్కర్స్, కరపత్రాల పంపిణీ నుంచి తప్పించాలని తదితర సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరింది. ఈ సమావేశంలో కో చైర్మన్లు ఎం రఘునాథరెడ్డి, చంద్రశేఖర్, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌లు చౌదరి పురుషోత్తం నాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా హత్య

(మొదటి పేజీ తరువాయి)

ధ్రువీకరించినట్లు మీడియా తెలిపింది. నస్రల్లా హత్యతో తమ లక్ష్యం నెరవేరిందని ఇజ్రాయిల్ సైన్యం వెల్లడించింది.

గత రాత్రి నుండి అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతున్న దాడులతో, మోగుతున్న సైరన్లతో, విమానాల రొదతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. గ్రామాలు, పట్టణాలు, నగరాలనే తేడా లేకుండా ఈ దాడులు కొనసాగాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు బీరుట్ సముద్రపు ఒడ్డు దగ్గరకు చేరుకుంటున్నారు. శనివారం ఉదయం బీచ్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో కార్లు పార్క్ చేసుకుని కుటుంబాలతో రోడ్లపైనే కూర్చుని వుండడం కనిపిస్తోంది.

లెబనాన్‌కు అండగా వుంటాం: ఇరాన్ నేత ఖమేని

హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా హత్య నేపథ్యంలో లెబనాన్‌కు అండగా ఉంటామని ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేని ఒక ప్రకటన చేస్తూ ఈ విషాద సమయంలో లెబనాన్ ప్రజలకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంత భవితవ్యాన్ని నిర్ణయించేది ప్రతిఘటనా శక్తులేనని, అందులో హిజ్బుల్లా అగ్ర భాగాన వుంటుందని వ్యాఖ్యానించారు. ఇజ్రాయిల్ విధానాన్ని ఖమేని తీవ్రంగా ఖండించారు. తదుపరి కార్యాచరణపై చర్చించి, నిర్ణయించేందుకు ఇతర ప్రాంతీయ గ్రూపులతో, హిజ్బుల్లాతో ఆయన సంప్రదింపులు జరుపుతున్నారు. శనివారం ఉదయం నుండి హిజ్బుల్లా రెండు డజన్లకు పైగా క్షిపణులను ఇజ్రాయిల్‌పై ప్రయోగించింది.

పోరు కొనసాగుతుందన్న హిజ్బుల్లా

తమ వ్యవస్థాపక నేతల్లో ఒకరైన నస్రల్లాను హత్య చేసిన శత్రువుపై పోరాటం కొనసాగుతుందని హిజ్బుల్లా ప్రకటించింది. పాలస్తీనాకు మద్దతు కొనసాగుతుందని తెలిపింది.

ప్రతిఘటన బలపడుతుంది

నస్రల్లా మృతికి పాలస్తీనా గ్రూపు హమాస్ సంతాపం ప్రకటించింది. "పోరు బాటలో వున్న నేతలు అమరులైనప్పుడు ఆ ప్రతిఘటనా క్రమం ఆదే బాటలో సాగి విజయం సాధిస్తుందని చరిత్ర మనకు రుజువు చేసింది. తర్వాత తరం నేతలు మరింత బలోపేతులై, మరింత కృతనిశ్చయం,, దీక్షతో ఈ పోరును కొనసాగిస్తారు." అని హమాస్ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రత్యేకంగా నస్రల్లా పేరును ప్రస్తావించకుండా శుక్రవారం నాటి దాడుల్లో మరణించిన వారికి టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ సంతాపం తెలిపారు. ఆ దాడులను తీవ్రంగా ఖండించారు.

హిజ్బుల్లా కొత్త నేత హషెమ్ సఫిద్దీన్?

నస్రల్లా హత్యతో హిజ్బుల్లా చీఫ్ బాధ్యతలు మత పండితుడు, రాజకీయ ప్రముఖుడు అయిన హషెమ్ సఫిద్దీన్ చేపట్టే అవకాశమున్నట్లు వార్తలొస్తున్నాయి.

వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులకు తీరని లోటు

ఏచూరి సంస్మరణ సభలో వక్తలు

సీతారాం ఏచూరి మృతి వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులకు తీరని లోటు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రచారకర్త అని, సమస్యల పరిష్కర్త అని, తమ హీరో అని తమ ప్రసంగాల్లో ఘనంగా నివాళులర్పించారు.





సీతారాం ఏచూరి సంస్మరణ సభలో మాట్లాడుతున్న పినరయి విజయన్, సభకు హాజరైన ప్రజలు

పోరాట యోధుడు : ఎన్ రామ్



ప్రముఖ జర్నలిస్ట్, హిందూ మాజీ ఎడిటర్ ఇన్ చీఫ్ ఎన్ రామ్ మాట్లాడుతూ సీతారాం అర్ధశతాబ్ద కాలంగా కలిసి ఉన్న స్నేహితుడు, సహచరుడు అని అన్నారు. భారత రాజకీయాలు కీలక దశకు చేరుకున్న నేపథ్యంలో సీతారాం మరణం వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులకు తీరని లోటు అని ఆయన మరణానంతరం సిపిఎం పొలిట్ బ్యూరో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొందని, అది సీతారాం జీవితం వ్యక్తిగత చిత్తశుద్ధి, త్యాగం, స్థిరమైన రాజకీయ తత్వానికి ఉదాహరణ అని అన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, ముఖ్యంగా మీడియా స్వేచ్ఛ కోసం నిలబడి, జర్నలిస్టులకు అండగా నిలవడంలో సీతారాం పట్టుదలతో ఉన్నారని అన్నారు. రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్, బిజెపి చేస్తున్న దాడులను ప్రతిఘటించిన బలమైన పోరాట యోధుడని అన్నారు. గోల్వాల్కర్ హిందూ రాష్ట్ర ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సీతారాం రాసిన కథనం తాను ఫ్రంట్‌లైన్ ఎడిటర్‌గా ఉన్నప్పుడు ప్రచురించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఆ కథనాలు ఏకంగా పుస్తకం రూపంలో తెచ్చామని తెలిపారు. హిందూత్వకు వ్యతిరేకంగా భారత రిపబ్లిక్, ప్రజాస్వామ్య స్వభావాన్ని పరిరక్షించడానికి సీతారాం ఎలా పోరాడారో గుర్తు చేశారు.

గుజరాత్ అల్లర్ల తరువాత వచ్చిన తొలి ఎంపిలలో ఒకరు : తీస్తా సెతల్వాద్




సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్ మాట్లాడుతూ 2002లో అల్లర్ల తరువాత పార్లమెంటరీ ప్రతినిధి బృందంలో భాగంగా గుజరాత్‌కు వచ్చిన తొలి ఎంపిలలో సీతారాం ఒకరని గుర్తు చేశారు. రాజ్యసభలో ఆయన చేసిన రెండు ప్రసంగాలను గుర్తు చేస్తూ, అవి ఏచూరి పాత్రను ప్రతిబింబిస్తాయని అన్నారు. ఫెడరలిజానికి సీతారాం నిబద్ధతను ఆమె కొనియాడారు.

అందరికీ రాజకీయ గురువు : జి.దేవరాజన్




ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి. దేవరాజన్ మాట్లాడుతూ వామపక్ష ఉద్యమంలో సీతారాం ఏచూరి ప్రతి ఒక్కరికీ రాజకీయ గురువు అని అన్నారు. రాజకీయాలంటే కేవలం అవకాశాల కళ కాదని, అసాధ్యాలను సుసాధ్యం చేయడమేనని సీతారాం నిరూపించారన్నారు.

లోతైన నిబద్ధత : మనోజ్ భట్టాచార్య




సీతారాం జీవించిన లక్ష్యం కోసం వామపక్ష, ప్రజాతంత్ర శక్తులన్నీ కలిసి రావాలని ఆర్ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య అన్నారు. వామపక్ష ఐక్యతకు సీతారాం లోతైన నిబద్ధతను ఆయన గుర్తు చేశారు.

ఏచూరి పోరాటాన్ని కొనసాగించాలి : దీపాంకర్ భట్టాచార్య



సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ ఏచూరి మారుతున్న కాలాన్ని, తాజా పోరాటాల ఆవశ్యకతను అర్థం చేసుకోగలిగారని అన్నారు. మతతత్వం వంటి సమస్యలపై సీతారాం బలంగా, శక్తివంతంగా గొంతెత్తారని, ఆయన పోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఏచూరి స్ఫూర్తితో పోరాడాలి : ఫరూక్ అబ్దుల్లా



సీతారాం ఏచూరికి ప్రత్యర్థులు లేరని, ఆయన జ్ఞాపకాన్ని కాపాడుకోవడానికి నిర్భయంగా పోరాడటమే ఘనమైన నివాళి అని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా అన్నారు. దేశంలో పేదరికాన్ని ఎలా నిర్మూలించాలో ఆలోచించారని, ప్రతి ఒక్కరూ ప్రేమ, సౌభ్రాతృత్వంతో ఎలా జీవించగలరని నిరంతరం ఆరా తీసేవారని పేర్కొన్నారు. ఏచూరి జ్ఞాపకాలు పెద్ద ప్రత్యర్థులతో పోరాడటానికి శక్తిని, ప్రేరణను ఇస్తాయని అన్నారు.

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రచారకర్త : కనిమొళి

ఏచూరి పోరాట యోధుడని డిఎంకె ఎంపి కనిమొళి అన్నారు. ఆయన తప్పుగా భావించేవాటిని విద్యార్థి దశ నుంచే నిర్భయంగా వ్యతిరేకించారని, చివరి శ్వాస వరకు అదే కొనసాగిందని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్యం పక్షాన నిలిచారని, భిన్నత్వంలో ఏకత్వం అనే ఆలోచనకు గొప్ప ప్రచారకర్త అని అన్నారు. తన తండ్రి కరుణానిధితో ఏచూరికి వ్యక్తిగతంగా గొప్ప అనుబంధం ఉందని అన్నారు. కోయంబత్తూరులో తమిళ సాంప్రదాయ సదస్సు జరిగినప్పుడు ఆ కార్యక్రమంలో ఏచూరి పాల్గొనాలని అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి చాలా పట్టుదలగా ఉన్నారని, ఏచూరిని తీసుకురావడానికి హెలికాప్టర్‌ను పంపారని గుర్తు చేశారు. ఏచూరి మరణవార్త వినగానే తన తండ్రి చనిపోయాక ఏర్పడిన శూన్యత తనలో ఏర్పడిందని అన్నారు.

మా హీరో ఏచూరి : సుప్రియా సూలే



రాజ్యసభలో ఏచూరి మా హీరో ఏచూరి అని ఎన్‌సిపి ఎంపి సుప్రియా సూలే అన్నారు. తన సొంత భావజాలం గురించి ఇంత స్పష్టంగా ఉన్న వారిని తాను మరెవరినీ కలవలేదని అన్నారు. దానికి కట్టుబడి సమకాలీన సమస్యలను నిర్వచించారని, పార్లమెంట్‌లో మొదలైన బాంధవ్యం ఇళ్ల వరకూ వెళ్లిందని తెలిపారు. తన కుమార్తె, కుమారుడు చదువుకు సంబంధించి ఎంతో సహకరించారని అన్నారు. ప్రజలను తన వెంట తీసుకెళ్లి విభేదాలను పరిష్కరించే అద్భుతమైన సామర్థ్యం ఏచూరికి ఉందని ఆమె అన్నారు. మహారాష్ట్రలో పోరాటాలకు ఆయన చేసిన కృషిని, రాష్ట్రంలో ఉల్లి రైతులకు ఆయన సంఘీభావాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు.

సమస్యల పరిష్కర్త : గోపాల్ రాయ్



కేజ్రీవాల్‌తో సహా ఆప్‌కి చెందిన ప్రముఖ నేతల అరెస్ట్‌తో ఢిల్లీ ప్రభుత్వం, తమ పార్టీ కూలిపోతుందనే భావన వచ్చినప్పుడు, తన కష్టాలు ఎవరికి చెప్పాలా అని ఆలోచించినప్పుడు ఏచూరి గుర్తుకు వచ్చారని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ అన్నారు. తాను ఏచూరిని చూడటానికి వెళ్లానని, "భయపడకు... మేం మీ వెంటే ఉన్నాం, పోరాడతాం' అని ఏచూరి భరోసా ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. ఐదు రోజుల తరువాత కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా రాంలీలా మైదానంలో జరిగిన భారీ సభకు ప్రముఖ రాజకీయ నేతలంతా వచ్చారని, వారందరినీ అక్కడికి తీసుకొచ్చింది ఏచూరి అని పేర్కొన్నారు. రాబోయే తరాలు ఆయన నుంచి స్ఫూర్తి పొందుతాయని అన్నారు.

ఎన్నో పాఠాలు నేర్పారు : రామ్ గోపాల్ యాదవ్



పార్లమెంటులో ఎలా జోక్యం చేసుకోవాలో, ఎలాంటి ప్రశ్నలు అడగాలో ఏచూరి సహా వామపక్ష ఎంపిలే తనకు నేర్పారని ఎస్‌పి ఎంపి రామ్‌గోపాల్ యాదవ్ అన్నారు. సీతారామ్‌కి విరోధులు లేకపోవడానికి కారణం, ఆయన వారి అభిప్రాయాలను కూడా వినడానికి ఇష్టపడటమేనని, అలాంటి నాయకులు కావాలని అన్నారు. సీతారాం వారసత్వాన్ని, కమ్యూనిస్టు ఉద్యమాన్ని సజీవంగా ఉంచాలని సిపిఎంని కోరారు.

ఏచూరిని కలిస్తే ఉత్సాహం వచ్చేది : మనోజ్ ఝా



సీతారాం ఏచూరి స్థానంలో మరొకరిని ఊహించలేమని ఆర్‌జెడి ఎంపి మనోజ్ కుమార్ ఝా అన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పుడు కొన్నిసార్లు నిరాశ చెందుతానని, ఆయనను కలిసిన తరువాతే తనకు ఉత్సాహం వచ్చేదని అన్నారు. 'ఎన్నికల్లో ఓడిపోతే ఏం, ముందుకు వెళ్దాం.. ఏం చేస్తాం.. ఆలోచిద్దాం' అని చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. కమ్యూనిస్టుగా ఉండడమంటే హృదయంతో ఉండటమని, ఆ లక్షణానికి సీతారాం ప్రతిరూపమని కొనియాడారు.

ప్రజాస్వామ్య శక్తుల ఉమ్మడి ఫ్రంట్ రూపశిల్పి : మహువా మాఝీ



జార్ఖండ్ ముక్తి మోర్చా ఎంపి మహువా మాఝీ మాట్లాడుతూ రాజకీయ నైతికత, భావజాలంపై వ్యక్తిగత ప్రయోజనాలే గెలుస్తున్న తరుణంలో సీతారాం మృతి తీరని లోటని అన్నారు. "ఆయన వామపక్షాల గొంతు మాత్రమే కాదు, ద్వేషపూరిత మత రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య శక్తుల ఉమ్మడి ఫ్రంట్ రూపశిల్పి" అని ఆమె చెప్పారు.





మీకోసం

నెయ్యి కరగబెట్టినప్పుడు గిన్నె అడుగుభాగంలో పేరుకుపోయిన జిడ్డు వదలాలంటే ఆ గిన్నెలో కొంచెం నీళ్లు ఒక చెంచా సోడా ఉప్పు వేసి ఐదు నిమిషాలు బాగా మరగబెడితే జిడ్డు త్వరగా వదులుతుంది.

జీవన సౌరభం

ఓడిపోతాననే భయంతో ముందుకు సాగని వ్యక్తి జీవితంలో ఎప్పటికీ విజయం సాధించలేడు.

JEEVANA జీవన the family

క్షమాపణ



అనగనగా ఇస్తాపూర్ అనే రాజ్యంలో ఒక రాజు ఉన్నాడు. ఆ రాజుకి ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు భైరవుడు. రెండో కొడుకు గజేంద్రుడు. భైరవుడు ఎప్పుడూ రాజ పదవి కోసం ఆలోచించకుండా ప్రజలతో కలిసి పనిచేసేవాడు. వారితోనే ఉండేవాడు. అది చూసి గజేంద్రుడు అన్న భైరవుడి మీద పగను పెంచుకున్నాడు.

కొంతకాలం తర్వాత మహారాజుకి ఆరోగ్యం చెడిపోయింది. 'ఇక పరిపాలన నావల్ల కాదు పెద్దవాడు భైరవుడు ప్రజల మెప్పును పొందాడు. కాబట్టి భైరవుని మహారాజుగా ప్రకటిస్తాను' అని మంత్రులతో చెప్పాడు. ఈ విషయం విన్న గజేంద్రుడు తండ్రిపై కోపాన్ని పెంచుకున్నాడు. తండ్రి తినే భోజనంలో విషం కలపమని ఒక భటునికి చెప్పాడు. ఆ భటుడు నేరుగా అన్న భైరవుని దగ్గరికి వెళ్లి, గజేంద్రుడు చేయమన్న పనిని గురించి చెప్పాడు. ఆవేశంతో రగిలిపోయిన భైరవుడు తమ్ముని వద్దకు బయలుదేరాడు. భటుని ద్వారా విషయాన్ని తెలుసుకున్న మహారాజు భైరవుడిని ఆపి, 'నాయనా భైరవా! నాకు నువ్వు ఎంతో.. గజేంద్రుడు అంతే. మీరు నాకు రెండు కళ్ళు. అతన్ని క్షమించి వదిలేయి' అని అన్నాడు.

'నాన్న నన్ను క్షమించండి. ఆవేశంలో ఇలా వచ్చాను. తమ్ముడు నాకు కుడి భుజం లాంటివాడు. వాడిని నేను ఎలా చంపుతాను అనుకున్నారు. మందలించడానికి బయలుదేరాను' అని అన్నాడు. 'మహారాజుగా తమ్ముడినే ప్రకటించండి' అని కూడా చెప్పాడు.

ఆ రోజు రాత్రే, 'గజేంద్రుడుని రాజుగా చేయమ'ని ఓ లేఖలో రాసి మంత్రికి అందజేస్తాడు మహారాజు. అయితే గజేంద్రుడు మంత్రి వద్దకు వెళ్లి ఆ లేఖను మారుస్తాడు. మరుసటి ఉదయమే మహారాజుగా ప్రకటించే ఆ లేఖలో భైరవుడి పేరు ఉంటుంది. మహారాజు, భైరవుడు ఇద్దరూ ఆశ్చర్యపోతారు. వెంటనే గజేంద్రుడు 'నాన్న నన్ను క్షమించండి. నేను మీ ప్రాణాలు తీయాలనుకున్నా.. నన్ను క్షమించి వదిలేసారు. నాకు రాజ్యం వద్దు. మీరు ఉంటే చాలు. అన్ననే మహారాజుగా చేయండి' అని తండ్రి కాళ్ళపై పడ్డాడు గజేంద్రుడు. గజేంద్రుడు మనసు మారినందుకు అందరూ సంతోషించారు. భైరవునికి మహారాజుగా పట్టాభిషేకం చేశారు.

– సంపత్ కుమార్,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
కోదాడ,
సూర్యాపేట జిల్లా,
తెలంగాణ.




తమాషా చేయండి

పిల్లలూ, ఇప్పటి వరకు గణితంలో చూసిన గమ్మత్తును ఇప్పుడు తెలుగు భాషలో ట్రై చేద్దామా! ఇక్కడ ఇచ్చిన పదాలను నిలువుగా, అడ్డంగా ఎలా చదివినా అవే పదాలు వచ్చేలా ఇచ్చాం. ఖాళీ గళ్లల్లో సరైన అక్షరాలు మీరే రాయాలి మరి. (ఉదాహరణకు ఒకటి ఇచ్చాం)

స మ త
మ జ్జి గ
త గ ము

	కా - పు	కా ర -	కం - ము
క్షీ ర -	ను వ్వ -	- గ డ	చ క్కె -
- వ్వ లు	- లు లు	ము - త	- ర ళి
ము - కు			

నేను గీసిన బొమ్మ





ఏల యశ్వంత్,
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాంపూర్,
నిజాంపేట మండలము,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఇప్పుడక్కడ పండగ శోభ లేదు..!

యుద్ధమో, ఉపద్రవమో, కరువో, కాటకమో ఒక ప్రాంతాన్ని అతలాకుతలం చేసినప్పుడు అక్కడ ఏ పండగ వాతావరణం కనిపించదు. ఆ ప్రజల ముఖాల్లో ఏమాత్రం సంతోషం తారసపడదు. సరిగ్గా ఇప్పుడు అలాంటి వాతావరణమే కనిపిస్తోంది పశ్చిమబెంగాల్ కలకత్తా నగరంలో. సాంప్రదాయ కళలకు, సాంస్కృతిక ఉత్సవాలకు నెలవైన అక్కడ ప్రతి ఏడూ, దేశంలోనే ఎక్కడా లేనట్లుగా దసరా పండగ అంగరంగ వైభవంగా జరుగుతుంది. కొన్ని నెలల ముందు నుండే నగర కూడళ్లన్నీ పండగ శోభతో అలరారుతాయి. దుర్గా ప్రతిమలు, పండగ డెకరేట్ ఐటమ్స్, పందిళ్లు, బట్టల షాపులు, పూజా సామగ్రి.. ఇలా ఒకటేమిటి ప్రతి ఒక్క చోట జనాలు బారులు తీరి ఉంటారు. కానీ ఇప్పుడు అలా లేదు.

శక్తికి మారుపేరుగా దుర్గని ఆరాధించడమే దసరా పండగ ప్రత్యేకత. వివిధ అలంకారాల్లో దుర్గా ప్రతిమలను కొలవడంలో దేశంలోనే కలకత్తా నగరం మొదటిది. సింహం, పులి వంటి క్రూరజంతువులపై స్వారీ చేస్తూ, చెడుని దునుమాడే ధీరోధాత్తగా, అత్యంత పరాక్రమవంతగా తయారైన దుర్గా ప్రతిమలు ఇక్కడ కనిపించినట్లుగా మరెక్కడా ఉండవంటే అతిశయోక్తి కాదు.. అటువంటి నగరంలో మహిళలకి సురక్షితమని భావించిన ఆ ప్రాంతంలో కొన్ని రోజుల ముందు జరిగిన యువ వైద్యురాలి హత్యాచారం అక్కడి పౌరులని దిగ్భ్రాంతికి గురిచేసింది. హత్యోదంతం తరువాత జరిగిన పరిణామాలు కూడా వారిని ఆలోచనల్లో పడేశాయి. నిందితులను అరెస్టుచేసినా వారిని ఏదో నిరాశ వెంటాడుతోంది. అందుకే పండగ వేళ ఎవరూ బయటికి రావడం లేదు. ఉత్సవాలు చేసుకోవడం లేదు. అందుకు నిదర్శనంగా ఎన్నో ఉదంతాలు ఇప్పుడు అక్కడ కనిపిస్తున్నాయి.



కలకత్తా కుమార్తులి ప్రాంత వాసులు దుర్గా ప్రతిమలు తయారుచేయడంలో సిద్ధహస్తులు. రెండు దశాబ్దాలకు పైగా వందల కుటుంబాలు ఈ పనిలో నిమగ్నమై ఉంటున్నాయి. దాదాపు 20 అడుగుల దుర్గా ప్రతిమని తయారుచేయడంలో 52 ఏళ్ల శుభదేందు పోరెల్‌ది అందెవేసిన చేయి. వందల్లో బొమ్మలు చేసి సకాలంలో అందిస్తాడని మంచి పేరుంది. అయితే ఇప్పుడతను అంత పెద్ద బొమ్మలు తయారుచేయడం లేదు. అసలు అన్ని బొమ్మలు కూడా చేయడం లేదు. ఈ పరిస్థితినే అతను ఇలా చెబుతున్నాడు. 'రెండు నెలల ముందు నుండే నాకు పని వస్తుంది. ఆర్డరు మీద ఆర్గనైజ్‌సంస్థలకు బొమ్మలు తయారుచేసి ఇస్తాం. కానీ ఇప్పుడు అన్ని ఆర్డర్లు లేవు. చాలా తక్కువే వచ్చాయి. ఈ ప్రాంత వాసులు ఇప్పుడు పండగ జరుపుకునే స్థితిలో లేరు' అని చెబుతున్నాడు.

పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా 43 వేల దుర్గా ఉత్సవాలు ప్రతి ఏడూ నిర్వహిస్తారు. ఒక్క కలకత్తాలోనే 3 వేల పైచిలుకు ఉత్సవాలు జరుగుతాయి. అయితే ఈ ఏడాది సుమారు 6 వందలకు పైగా ఆర్గనైజ్ సంస్థలు ఉత్సవాలను జరిపేందుకు ముందుకు రాలేదు. 'పండగ జరపకుండా వెనక్కి తగ్గడం కరోనా సమయంలోనే చూశాం. మళ్లీ ఇప్పుడు కనిపిస్తోంది' అంటున్నారు గ్రూప్ ఆఫ్ ఆర్గనైజెస్‌ని నిర్వహించే అభిషేక్.



సాధారణంగా పండగకి నెల రోజుల ముందు నుండే బట్టల దుకాణాలు, మాల్స్ రద్దీగా ఉంటాయి. కానీ ఇప్పుడు ఏ షాపు చూసినా జనాలు లేక వెలవెలబోతున్నాయి. 'పండగ సీజన్‌లో మా దుకాణాల్లో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదు. కానీ ఆర్ జి కర్ హాస్పటల్ ఘటన తరువాత ప్రజల్లో చాలా మార్పు వచ్చింది. మొదటి బేరం కావడానికి మేము రోజంతా ఎదురుచూడాల్సి వస్తోంది. అసలు వీధుల్లో జనాలు రావడం లేదు' అని బట్టల షాపు యజమాని ఖాన్ అంటున్నాడు.

కలకత్తా నగరంలో జరిగే దసరా ఉత్సవాలను చూసేందుకు దేశవిదేశాల నుండి టూరిస్టులు వస్తుంటారు. ఈసారి వారి రాక కూడా కనిపించడం లేదు. 'యాత్రికుల రద్దీతో హోటళ్లు, తినుబండారాల స్టాళ్లు ఎప్పుడూ కిక్కిరిసి ఉండేవి. క్రితం ఏడాది నగరవ్యాప్తంగా హోటళ్ల వ్యాపారం 180 కోట్ల రూపాయలు దాటింది. కానీ ఇప్పుడు మూడొంతుల్లో రెండొంతులకు పడిపోయింది' అంటున్నారు రెస్టారెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుదేష్.

ఉత్సవాలు ఉత్సాహంగా జరగాలంటే యువత ముందుకురావాలి. కానీ ఇప్పుడు ఈ ప్రాంతంలో యువత అంతా నిరసనల్లో పాల్గొంటున్నారు. సోషల్‌మీడియాలో కూడా వైద్యురాలి హత్యోదంతంపైనే కథనాలు వస్తున్నాయి. 'ఇంతకుముందు మా కుమార్తులికి చాలామంది యువత వచ్చేవారు. మేం తయారుచేసే ప్రతిమలను వివిధ భంగిమల్లో ఫొటోలు తీసుకుని సోషల్‌మీడియాలో షేర్ చేసుకునేవాళ్లు. ఇప్పుడు ఇంతవరకు ఒక్కరు కూడా రాలేదు. నగరం విషాదంలోకి వెళ్లిపోయింది. ఈ పండగ నిశ్శబ్దంగా గడిచిపోతుంది' అని కుమార్తులి పోరెల్ గద్గద స్వరంతో చెబుతున్నాడు.

స్వాతంత్ర్య దినోత్సవానికి కొన్ని రోజుల ముందే, అత్యంత ఘోరంగా అత్యాచారానికి గురై మరణించింది యువ వైద్యురాలు. ఆమె మృతికి సంతాపంగా దేశవ్యాప్తంగా ఎన్నోచోట్ల ఆందోళనలు జరిగాయి. కొన్ని రోజుల తరువాత వాతావరణం చల్లబడింది. కానీ ఆ ప్రాంత వాసులు మాత్రం అలా ఊరుకోలేదు. దేశం నలుమూలలా వినిపించేలా ఇప్పటికీ తమ నిరసనను గొంతెత్తి నినదిస్తున్నారు. మళ్లీ మళ్లీ ఈ అన్యాయం జరగకూడదని బలంగా విశ్వసిస్తున్నారు. అందుకే వారంతా పండగ జరుపుకోవడానికి ఇష్టపడడం లేదు. దేశంలో మహిళలు ప్రమాదంలో ఉన్న వేళ, ఉత్సవాలు చేసుకోవాల్సిన సమయం ఇది కాదని ఆ ప్రజల్లో వచ్చిన చైతన్యం ఎంతోమందికి ఆదర్శం.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68